


శ్రీవేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని కల్తీ చేయడం వైసీపీ చేసిన ఘోర అపచారం. పామాయిల్, లాక్టిక్, ఎసిటిక్ యాసిడ్‌ల వినియోగం మహాపాపం. దీనిపై ప్రశ్నిస్తే ఎదురు దాడులు దుర్మార్గం. చరిత్రలో స్వామి పవిత్రతను ఎవరూ అవమానించలేదు.

**ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ**


శుక్రవారం 06.02.2026


INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 33 సంచిక - 290 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# ప్రతి ఎకరాకు నీరివ్వడమే నిజమైన జలహారతి



**సాగు నీటి సంఘాలు చేసే పనులకు జీఎస్టీ మినహాయింపు**

**ప్రతీ ఎకరాకు తాగునీరు అందేలా సాగు నీటి సంఘాలు కృషి**

**అనంతపురం జిల్లాను పండ్ల తోటల వనంగా మార్చిన ఘనత ఎన్డీఏదే**

**రాయలసీమ ఎత్తిపోతల పేరిట మభ్యపెట్టే ప్రయత్నాలు**

**సాగునీటి సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు**




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ప్రతీ ఎకరాకు సాగు నీరు అందేలా సాగునీటి సంఘాలు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. సాగు నీటి సంఘాలు చేసే పనులకు జీఎస్టీ లేకుండా చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న ఏపీని సమర్థ పాలన, నిర్దిష్ట ప్రణాళికలతో రైతు సానుకూల రాష్ట్రంగా మార్చామని స్పష్టం చేశారు. గురువారం అమరావతిలోని నేలపాడు వద్ద ఉన్న పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహించిన నీరు-ప్రగతి, జల హారతి సాగునీటి సంఘాల భాగస్వామ్యం కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ముందుగా సమావేశ ప్రాంగణం వద్ద ఏర్పాటు చేసిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణ పురోగతి వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగిస్తూ...."మన జీవన విధానంలో నీరు చాలా ముఖ్యం. రాయలసీమలో ఊట కాల్వలు ఉండేవి. వాటిలో నీరు సమృద్ధిగా ఉండటంతో పంటలు పండేవి. కాలక్రమంలో నీటిపై నిర్లక్ష్యంతో సమస్యలు వచ్చాయి. సీమ ఎడారిగా మారుతుందని చాలామంది అనేవారు. సీమను రతనాల సీమ చేయాలని ఎన్టీఆర్ సాగునీటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగుగంగ సహా అనేక ప్రాజెక్టులు రావడానికి నాడు తెలుగుదేశం పార్టీ చూపిన చొరవే కారణం. నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం నీరు-చెట్టు వంటి కార్యక్రమాలు చేపట్టాం. భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతలు సహా అనేక కార్యక్రమాలు చేపట్టాం. దేశంలోనే తక్కువ వర్షపాతం నమోదయ్యే రెండో జిల్లాగా ఉన్న అనంతపురం నేడు పండ్ల తోటల వనంగా మారిందంటే అందుకు ప్రభుత్వ దూరదృష్టే కారణం. ఒక్క ఏడాదిలోనే 10 లక్షల ఇంకుడు గుంతలు తవ్వాం. మైక్రో ఇరిగేషన్ కింద 90 శాతం సబ్సిడీ ఇచ్చి పండ్ల తోటలకు శ్రీకారం చుట్టాం. రాయలసీమను రతనాల సీమగా చేసే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వానిది. భవిష్యత్ లో సీమకు బంగారు భవిష్యత్ ఉంటుంది.


మిగతా 3లో...




## భగవంతుడు ఊరుకోరు
# కల్తీ ప్రసాదం మహాపాపం

- తిరుమల లడ్డూ కల్తీ -శ్రీవారి పవిత్రత దెబ్బతీసేందుకే కుట్ర
- కల్తీ నెయ్యి సరఫరాపై 2022లో వచ్చిన నివేదికను తొక్కిపెట్టారు
- భగవంతుడు అంటే లెక్క లేదు...హిందూమతం పట్ల విశ్వాసం లేదు
- ఈ వ్యవహారాన్ని వదిలి పెట్టం..దోషులపై చర్యలు తీసుకుంటాం
- కల్తీ వ్యవహారంలో తప్పును అంగీకరించకపోగా క్లీన్ చిట్ అంటూ తప్పుడు ప్రచారం
- కరడు గట్టిన నేరస్తులే అసత్యాన్ని నమ్మించే ప్రయత్నం చేస్తారు
- ఎన్డీఏ కూటమి హిందువుల సెంటిమెంట్‌ను పరిరక్షిస్తుంది


3లో


## తిరుమల లడ్డూ కల్తీ...
# వైసీపీ తెలిసి చేసిన నేరం



- భగవంతుడితో పెట్టుకున్నవాడు నశించాల్సిందే: పవన్‌కల్యాణ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** భగవంతుడిపై పగ పట్టి ఏడుకొండల్ని రెండు కొండలుగా చిత్రీకరించిన నేపథ్యం వైసీపీదేనని ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ తీవ్ర ఆరోపణలు చేశారు. దేవుడితో పెట్టుకున్నవాడు సర్వనాశనం అవుతాడే తప్ప బతికి ఉన్న దాఖలాలు లేవని వ్యాఖ్యానించారు. ఇప్పటికైనా చేసిన మహాపాపానికి దేవుణ్ణి క్షమాపణ కోరాలని, లేకపోతే రాజకీయంగా మట్టికరిసిపోతారని హెచ్చరించారు.

తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంపై ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై కూటమి నేతలు సమావేశమై చర్చించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన పవన్‌కల్యాణ్, "భగవంతుడికి మొకరిల్లే వరకూ ఈ విషయాన్ని వదిలిపెట్టం" అని స్పష్టం చేశారు.


మిగతా 2లో...


# కార్మికులకు సంక్షేమ పథకాల పునరుద్ధరణ



- కార్మికులకు ఆధునిక నైపుణ్యాల్లో శిక్షణ
- సంజీవనితో అనుసంధానించి వైద్య పరీక్షలు
- కార్మిక శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అసంఘటిత రంగంలో ఉన్న భవన నిర్మాణ, ఇతర కార్మికులకు గతంలో అందించిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రసూతికి రూ.20 వేలు, వివాహానికి రూ.40 వేలు, సహజ మరణానికి రూ.60 వేలు, అంత్యక్రియలకు రూ.20 వేల మేర ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం కార్మికశాఖపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి అసంఘటిత రంగంలో ఉన్న కార్మికుల్లో ఆధునిక నైపుణ్యాలను, జీవన ప్రమాణాలను పెంచే అంశంపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.


మిగతా 2లో...


# కల్తీ వ్యవహారంపై ప్రజల ముందుకు నిజాలు

- కల్తీ తిరుమల లడ్డూ వ్యవహారంపై కూటమి కీలక భేటీ
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తిరుమలలో ప్రసాదంగా ఇచ్చే లడ్డూల్లో నెయ్యి కల్తీ వ్యవహారంపై కూటమి పార్టీల అగ్రనేతలు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంలో అత్యవసరంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, ఆనం రాంనారాయణ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, పార్థసారథి, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా ఉన్నతాధికారులు తమ వద్ద ఉన్న వివరాలను నేతలకు వివరించారు.

ఈ సమావేశంలో వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన కల్తీ లడ్డూ వ్యవహారానికి సంబంధించిన వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని కూటమి నిర్ణయించింది. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మాట్లాడుతూ, "కల్తీ లడ్డూ వ్యవహారంలో తమకుతామే



క్లీన్ చిట్ ఇచ్చుకోవడం దుర్మార్గం. ఇది ప్రజల విశ్వాసాన్ని మోసం చేయడమే" అని తీవ్రంగా ధ్వజమెత్తారు. వైఎస్సార్సీపీ పాలనలో అన్యమతస్థుల ప్రాబల్యాన్ని పెంచి దానిని ఓటు బ్యాంకుగా మార్చుకునే కుట్రకు తెరలేపారని మాధవ్ ఆరోపించారు. ఈ కుట్రలను రాజీ లేకుండా కూటమి ప్రభుత్వం అడ్డుకుంటోందని తెలిపారు. సింథటిక్ నెయ్యితో లడ్డూలు తయారు చేసి దాదాపు రూ.250 కోట్ల మేర నిధులు దుర్వినియోగం చేశారని మండిపడ్డారు.

# ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 100 శాతం ఖర్చు చేయాలి



- సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో అడ్మిషన్లు 100 పూర్తి కావాలి
- మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి
- వెలగపూడి సచివాలయంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో మంత్రి డా. స్వామి సమీక్ష సమావేశం


2లో


## పామాయిల్ సాగు చరిత్రలో
# తొలిసారి ఏపీలోనే అధిక ధర



- రైతులకు గిట్టుబాటు ధర...కూటమి ప్రభుత్వ నిర్ణయాలకు హర్షం
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడికి పామాయిల్ రైతుల ప్రత్యేక కృతజ్ఞతలు

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పామాయిల్ పంట సాగు చరిత్రలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లోనే అధిక ధర లభించడం రాష్ట్ర రైతుల్లో ఆనందోత్సాహాలను నింపింది.


మిగతా 2లో...


# హజ్ యాత్రకు కార్యాచరణ




- రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి
- హజ్ యాత్ర- 2026 ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష

**విజయవాడ, (జర్నలిస్ట్ ఫైల్):** పవిత్ర హజ్ యాత్ర కు వెళ్లే భక్తులందరికీ సకల సౌకర్యాలు కల్పించడం కోసం ప్రత్యేకంగా అన్ని చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. గురువారం హజ్ యాత్ర -2026 ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.


మిగతా 2లో...


# వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణ:సిఎస్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 9వ తేదీ నుండి 28 వరకూ జనాభా లెక్కల సేకరణ జరుగుతుందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. జనాభా లెక్కల సేకరణ-2027పై గురువారం ఎపి సచివాలయంలో రాష్ట్ర స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం(ఎస్ఎల్సిసి)ఆయన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రకియ సజావుగా జరిగేందుకు ఇప్పటి నుండే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జనాభా లెక్కల సేకరణ ప్రక్రియపై క్షేత్ర స్థాయిలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు.


మిగతా 2లో...


# ఎఫ్ పి.ఓలను స్వయం సమృద్ధి సంస్థలుగా తీర్చిదిద్దాలి



- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** గ్రామీణ జీవనోపాధుల అభివృద్ధిలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, వివిధ ప్రభుత్వ శాఖల ద్వారా చేపట్టే కార్యక్రమాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థలతో అనుసంధానం చేయాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం విజయవాడలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రధాన కార్యాలయంలో ఎఫ్.పి.ఓలకు సాంకేతిక సహకారం అందిస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల (ఎన్ జి వోల) ప్రతినిధులు, సెర్ప్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. సెర్ప్-ఎఫ్.పి.ఓల నిర్మాణం, వాటి బలోపేతం, ప్రస్తుత స్థాయిని అంచనా వేసేందుకు ఒక ప్రత్యేక 'టూల్' అభివృద్ధిపై చర్చించారు.

**కిందటేడు బాలింతలకు మాత్రమే పంపిణీ**

**ఒకటి లేదా రెండు ఇంజెక్షన్లతో రక్తహీనత పరిష్కారం!**

**ఆసుపత్రులకు ఉచిత రవాణా సదుపాయం**

# గర్భిణీలకు సైతం ఉచితంగా ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్ ఇంజెక్షన్

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రక్త హీనత సమస్య కలిగిన గర్భిణులకు కూడా ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్ (ఎఫ్సీఎం) ఇంజక్షన్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. ప్రస్తుతం బాలింతలకు మాత్రమే ఇచ్చే ఈ ఇంజక్షన్ను త్వరలో గర్భిణీలకు కూడా ఉచితశీగా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. హీమోగ్లోబిన్ పది అంతకంటే తక్కువగా ఉన్నవారికి మాత్రమే ఇచ్చే ఈ ఇంజక్షన్వల్ల హీమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య పరిష్కారం అవుతుందని, ప్రసవంపరంగా




2లో


ఆరోగ్య సమస్యలు తలెత్తుకుండా ఉంటాయని మంత్రి నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంజెక్షన్ అవసరమైన గర్భిణులకు ఉచిత రవాణా (తల్లీబిడ్డ ఎక్స్ ప్రెస్) సౌకర్యాన్ని కూడా కల్పిస్తారు.

**తొలుత బాలింతలకు మాత్రమే! :** కిందటేడాది సెకండరీ ఆసుపత్రుల్లో ప్రసవించిన వారిలో రక్తహీనత సమస్య కలిగిన 53,500 మందికి నిర్దిష్ట ప్రమాణాలు అనుసరించి ఈ ఇంజెక్షనను ఇచ్చారు. ఒక్కొక్క ఇంజెక్షన్ ధర రూ 1,478. 40. ఈ సారి గర్భిణుల్లో 18,950 మందికి కూడా ఈ ఇంజెక్షన్ను

# 2027 నాటికి పోలవరం పూర్తే లక్ష్యం: మంత్రి కందుల దుర్గేష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రాష్ట్రసమగ్ర అభివృద్ధి, రైతాంగ శ్రేయస్సే ధ్యేయంగా నదుల అనుసంధాన ప్రక్రియకు శ్రీకారం చుట్టిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకే దక్కుతుందని రాష్ట్ర పర్యాటక మంత్రి, గుంటూరు జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్ కొనియాడారు. గురువారం అమరావతి పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన సాగునీటి వినియోగదారుల సంఘాల సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు నిమ్మల రామానాయుడు, అచ్చెన్నాయుడు, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వంలో నీటిపారుదల శాఖపై కనీస అవగాహన లేని మంత్రులను చూశామని,


2 లో..

# గర్భిణీలకు సైతం ఉచితంగా ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్ ఇంజెక్షన్



(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చేందుకు కేంద్రం ఆమోదించింది. వీరితోపాటు యధావిధిగా 53,500 మంది బాలింతలకు ఈ ఇంజెక్షన్ ను ఇస్తారు.

**వ్యయప్రయాసలు తగ్గింపు! :** వాస్తవానికి గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్య కలిగిన వారికి "ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్ను ఇస్తున్నారు. రక్తహీనత లోపాన్ని అనుసరించి ఐరన్ సుక్రోజ్ ఇంజెక్షన్లను 7-10 మధ్య ఇస్తున్నారు. దీనివల్ల గర్భిణులు పలుమార్లు ఆసుపత్రులకు రావాల్సి వస్తోంది. వీటిని తగ్గించే ఉద్దేశంతో "ఫెర్రిక్ కార్బాక్సీ మాల్టోజ్'న్ను కూడా గర్భిణులకు ఇవ్వాలని కేంద్రం సూచించింది.

**జిల్లాలకు ఇంజక్షన్ల సరఫరా :** బాలింతల కేటగిరిలో 53,500 'ఎఫ్సీఎం'ల ను జిల్లాలకు పంపించినట్లు మంత్రి తెలిపారు. ప్రతి సీహెచ్సీకి 80, ఏరియా ఆసుపత్రికి 175, జిల్లా ఆసుపత్రులకు 400 చొప్పున ఈ ఇంజెక్షన్లను జిల్లాలకు పంపారు. గర్భిణులకు కూడా ఇచ్చేందుకు కేంద్రం కేటాయించిన 18,500 ఇంజెక్షన్లను త్వరలో జిల్లాలకు పంపించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. గర్భిణులకు ఈ ఇంజెక్షన్ ఎలా ఇవ్వాలన్న దానిపై త్వరలో జిల్లాలకు మార్గదర్శకాలు వైద్య ఆరోగ్య శాఖ పంపనుంది. ఎఫ్సీఎం ఇంజక్షన్ ఇచ్చిన వారికి హిమోగ్లోబిన్ స్థాయి రెండు శాతం నుంచి మూడు శాతం వరకు పెరిగిందని అధికారులు తెలిపారు.

# ఎఫ్ పి.ఓలను స్వయం సమృద్ధి సంస్థలుగా తీర్చిదిద్దాలి



(మొదటి పేజీ తరువాయి)

'ఒక ఎఫ్.పి.ఓ - ఒక ఉత్పత్తి' విధానంలో భాగంగా వాల్యూ చైన్ అభివృద్ధి, ఎఫ్.పి.ఓల స్థాయిలో చేపడుతున్న వివిధ జీవనోపాధి కార్యక్రమాలపై కూలంకషంగా చర్చించారు. ప్రతీ నెల, సంవత్సర కాలానికి స్పష్టమైన రోడ్ మ్యాప్, జీవనోపాధి ప్రణాళికలను సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించారు. విజయవంతమైన ఎఫ్.పి.ఓల కేస్ స్టడీలను వీడియో డాక్యుమెంటరీలుగా రూపొందించాలని సూచించారు. ఎన్.జి.ఓల పురోగతిని సమీక్షించడానికి ఒకే రకమైన ఫార్మాట్‌ను రూపొందించాలని, అలాగే ఎన్.జి.ఓ భాగస్వాములు సంబంధిత జిల్లాల ప్రాజెక్ట్ డైరెక్టర్లతో (పిడిలతో) సమన్వయం చేసుకుంటూ కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.

ఈ సమావేశంలో సెర్ప్ కార్యదర్శి వాకాటి కరుణ, డిప్యూటీ సి.ఇ.ఓ శ్రీరాములు నాయుడు, హైపర్ ఇంటర్నేషనల్, బ్రెడ్స్, కాల్గుడి, డిజిటల్ గ్రీన్, వాసన్, విజయవాహిని ఛారిటబుల్ ఫౌండేషన్ ప్రతినిధులు, సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

# 2027 నాటికి పోలవరం పూర్తే లక్ష్యం: మంత్రి కందుల దుర్గేష్

(మొదటి పేజీ తరువాయి)

నేడు 24 గంటలు కష్టపడే మంత్రి నిమ్మల రామానాయుడు నేతృత్వంలో నీటిపారుదల శాఖ పరుగులు పెడుతోందని హర్షం వ్యక్తం చేశారు. గతంలో 'సోమవారం-పోలవరం' కార్యక్రమం ద్వారా ప్రాజెక్టును పరుగులు పెట్టించిన చంద్రబాబునాయుడు, 2027 నాటికి పోలవరం పూర్తి చేసి తీరాలన్న పట్టుదలతో ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం నీటిపారుదల వ్యవస్థను గాడిలో పెట్టి ప్రాజెక్టులకు ప్రాధాన్యం ఇస్తూ పూర్తి చేస్తోందని తెలిపారు. ఈ క్రమంలో గోదావరి, కృష్ణా, పెన్నా నదుల అనుసంధానం ద్వారా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలను సుసంపన్నం చేస్తున్నామని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. నదుల అనుసంధానం వల్లే నేడు అనంతపురం జిల్లా కోనసీమను మించిన ప్రగతిని సాధిస్తోందని ఆయన గుర్తు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సంపూర్ణ సహకారం అందిస్తూ, పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా నీటి సరఫరా రంగంలో విశేషమైన ప్రగతిని సాధిస్తున్నారని కొనియాడారు. అనివార్య కారణాల వల్ల డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ సభకు రాలేకపోయారని, వారి ప్రతినిధిగా తాను హాజరైనట్లు తెలిపారు.

తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ కొట్టుకుపోయినప్పుడు సీఎం చంద్రబాబునాయుడు తక్షణమే స్పందించి, మంత్రులు నిమ్మల రామానాయుడు, పయ్యావుల కేశవ్‌లను పంపించి కేవలం 5 రోజుల్లోనే సమస్యను పరిష్కరించడం అసామాన్యమని కొనియాడారు. 786 కిలోమీటర్ల పొడవైన హంద్రీనీవా కాలువను బాగు చేసే పనులు కూడా శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న 6,047 నీటి సంఘాలు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 58 ప్రాజెక్టు కమిటీలు అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నీటి యాజమాన్య నిర్వహణ, చెరువులు నింపడం, భూగర్భ జలాల పెంపు వంటి అంశాల్లో సీఎం చంద్రబాబునాయుడు దిశానిర్దేశం ప్రకారం పనిచేసి ఆంధ్రప్రదేశ్‌ను సస్యశ్యామలం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ మాధవ్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు నీటి సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సి సబ్ ప్లాన్ నిధులు 100 శాతం ఖర్చు చేయాలి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఎస్సి సబ్ ప్లాన్ నిధులు 100 శాతం ఖర్చు చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డా. డోలా బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. గురువారం నాడు వెలగపూడి సచివాలయంలో సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో మంత్రి డిఎస్ బీవీ స్వామి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సి సబ్ ప్లాన్ నిధులు, ఎస్సి అట్రాసిటీ బాధితులకు పరిహారం, నూతన హాస్టళ్ల నిర్మాణం, హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్ల ఏర్పాటు, అడ్మిషన్లపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ఎస్సి సబ్ ప్లాన్ నిధుల వినియోగానికి యాక్షన్ ప్లాన్ రూపొందించి 100 శాతం నిధులు ఖర్చు చేయాలి. వచ్చే విద్యా సంవత్సరానికి అన్ని హాస్టళ్లలో అడ్మిషన్లు 100 పూర్తి కావాలి. పీఎం అజయ్ కింద నిర్మిస్తున్న నూతన హాస్టళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి. సంక్షేమ హాస్టళ్లు, అంబేద్కర్ గురుకులాల్లో త్వరితగతిన సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. అద్దె భవనాల్లో ఉన్న హాస్టళ్లకు శాశ్వత భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.

# వచ్చే ఏడాది జనాభా లెక్కల సేకరణ:సిఎస్

(మొదటి పేజీ తరువాయి)

ఇందుకు సంబంధించి ఇప్పటికే తగిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని వాటిని తుఛ తప్పక పాటించి జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని అన్నారు. జనాభా లెక్కల సేకరణ-2027పై ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక ఐఇసి మెటీరియల్ ను ప్రచురించి అన్ని జిల్లాలకు పంపాలని అన్నారు. అంతేగాక ఎన్నికల సమయంలో వలె నిర్దిష్ట కాలపరిమితిలో చేయాల్సిన పనులపై ప్రత్యేకంగా బుక్లెట్ ను ప్రచురించి జిల్లాలకు పంపాలని సిఎస్ విజయానంద్ సూచించారు.



ఈసమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి,జనాభా లెక్కల రాష్ట్ర కోఆర్డినేటర్ ఎస్.ఎస్.రావత్ మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ-2027పై ప్రజల్లో తగిన అవగాహన కల్పించి వారికి సంబంధించిన పూర్తి సమాచారం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. వివిధ శాఖల పరంగా ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయి అధికారులు సిబ్బందికి ఆయా శాఖలు తగిన ఆదేశాలు జారీ చేయాలని చెప్పారు.

ఈసమావేశంలో రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జె.నివాస్ జనాభా లెక్కల సేకరణ-2027పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ గత జనాభా లెక్కల సేకరణ 2011లో జరిగిందని తదుపరి జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది ఫిబ్రవరి 9నుండి 28 వరకూ జరగనుందని తెలిపారు. రానున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని మొదటి దశ హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్(హెచ్ఎల్ఓ),రెండవ దశ పాపులేషన్ ఎన్యుమరేషన్ (పిఇ) జరుగుతుందని వివరించారు. రాష్ట్ర స్థాయిలో జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జిపిఎం అండ్ ఎఆర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్టేట్ కోఆర్డినేటర్‌గా 13 మంది వివిధ శాఖల కార్యదర్శులు,కమీషనర్లతో రాష్ట్ర స్థాయి కోఆర్డినేషన్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. దేశంలో జనాభా లెక్కల సేకరణ నేపధ్యాన్ని వివరిస్తూ 2027లో నిర్వహించే జనాభా లెక్కల సేకరణ 16వది కాగా స్వాతంత్ర్యానంతరం నిర్వహించే 8వ జనాభా లెక్కల సేకరణ అని తెలిపారు. ఈసారి నిర్వహించే జనాభా లెక్కల సేకరణ ప్రత్యేకతల గురించి వివరిస్తూ పోర్టల్స్ మరియు యాప్స్ ద్వారా నిర్వహించే డిజిటల్ సెన్సస్ అని డిజిటల్ సెన్సస్ అనగా డేటా సేకరణ,నిర్వహణ, మానిటరింగ్ జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే సెల్ఫ్ ఎన్యుమరేషన్,కుల గణన,జియో రిఫరెన్సు మ్యాపులు, కృత్రిమ మేధను ఉపయోగించి వేగవంతంగా డేటా డెస్సిమినేషన్ వంటి చర్యలు తీసుకుంటారని వివరించారు. డిజిటల్ సెన్సస్ కు సంబంధించి మొబైల్ యాప్స్,వెబ్ పోర్టళ్ళను 16 ప్రాంతీయ భాషల్లో రూపొందించడం జరుగుతోందని వివరించారు.

అనంతరం జనాభా లెక్కల సేకరణ-2027 టైం లైన్ గురించి ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం గత జూన్ 16న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. ఈనెలలో ప్రిన్సిపల్ సెన్సస్ అధికారుల సమావేశం,ఫిబ్రవరి-ఏప్రిల్ మాసాల మధ్య మాస్టర్ ట్రైనర్లు,ఫీల్డు ట్రైనర్లు,సూపర్ వైజర్లు, ఎన్యుమరేటర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడతాయని వివరించారు. ఈఏడాది ఏప్రిల్ నుండి సెప్టెంబరు మాసాల మధ్య హౌస్ లిస్టింగ్ కు సంబంధించిన ఫీల్డు వర్కు నిర్వహించ బడుతుందని దానికి 15 రోజుల ముందు సెల్ఫ్ ఎన్యుమరేషన్ కు అవకాశం ఇవ్వబడుతుందని చెప్పారు. నవంబరు-డిశంబరు మాసాల్లో జనాభా లెక్కల సేకరణకు అవసరమైన మెటీరియల్ ప్రచురణ జిల్లాలకు పంపిణీ ప్రక్రియ జరుగుతుందని,డిశంబరు నెలలో సెన్సస్ అధికారులకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని వివరించారు. అదే విధంగా డిశంబరు నుండి వచ్చే ఏడాది జనవరి మాసాల మధ్య మాస్టర్ ట్రైనర్లు,ఫీల్డు ట్రైనర్లు,సూపర్ వైజర్లు,ఎన్యుమరేటర్ల నియమాక ప్రక్రియ జరుగుతుందని, డిశంబరులో స్పెషల్ చార్జి అధికారుల నియామకం వారికి శిక్షణా కార్యక్రమం ఉంటుందని వివరించారు. అనంతరం రాష్ట్ర స్థాయి కోఆర్డినేషన్ కమిటీకి సంబంధించిన శాఖల చేయాల్సిన ఏర్పాట్లపై సెన్సస్ డైరెక్టర్ నివాస్ వివరించారు. ఇంకా ఈసమావేశంలో స్వర్ణ గ్రామ,వార్డుల సంచాలకులు శివప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు. అదే విధంగా వర్చువల్ గా పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్,విద్యాశాఖ కార్యదర్శి కె.శశిధర్, ఐటి శాఖ కార్యదర్శి కె.భాస్కర్, సిడిఎంఏ సంపత్ కుమార్ తదితర అధికారుల పాల్గొన్నారు.

# కార్మికులకు సంక్షేమ పథకాల పునరుద్ధరణ

(మొదటి పేజీ తరువాయి)

నిర్మాణ రంగంలో ఉన్న ప్రముఖ కంపెనీలు ఎల్ అండ్ టీ, ఎన్సీసీ, మిట్టల్ సహా వేర్వేరు సంస్థల సహకారంతో వారికి అవసరమైన నైపుణ్య శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆధునిక నైపుణ్య శిక్షణ ద్వారా ఏపీలోని కార్మికులు దేశ విదేశాల్లోని ఉపాధి అవకాశాలను దక్కించుకుని అధిక ఆదాయాన్ని ఆర్జించేలా చూడాలని సూచించారు. జిల్లాల వారీగా, రంగాల వారీగా కార్మికుల డేటా బేస్ ను రూపొందించాలని.. వారిలో నైపుణ్యాల స్థాయిని అంచనా వేయాలని ముఖ్యమంత్రి కార్మిక శాఖకు నిర్దేశించారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఈ డేటా బేస్ ను అనుసంధానించటంతో పాటు కార్మికులు లేటరల్ ఎంట్రీ ద్వారా వివిధ కోర్సులు అభ్యసించి ఉన్నత విద్యార్హతను సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిగ్ వర్కర్లు, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికుల ఆదాయాలు గణనీయంగా పెరిగేందుకు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. సిమ్యులేషన్ ల్యాబ్స్ సహా ఆధునిక శిక్షణ నైపుణ్యాల ద్వారా ఉత్పాదకత పెంచే అంశంపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. వివిధ రంగాలకు అవసరమైన ఆధునిక పనిముట్లను కూడా కార్మికులకు అందించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఏపీలో ఉన్న



కార్మికుల్లో సాంకేతిక పరమైన నైపుణ్యాలు పెరిగితే అధిక ఆదాయాన్ని ఆర్జించే అవకాశం ఉంటుందన్నారు. రాష్ట్రంలోని 20 లక్షల మంది కార్మికులకు నైపుణ్యాలు పెంచేందుకు అనువుగా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో స్కిల్డ్ లేబర్ ను తయారు చేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న వివిధ భారీ పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు కూడా మన యువతకు అవసరమని ఆయన అన్నారు. అసంఘటిత రంగంలోని కార్మికులను మైక్రో ఎంట్రప్రెన్యూర్లగానూ ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తీవ్ర అనారోగ్య సమస్యలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ తో పాటు కార్మిక శాఖ ద్వారా రూ. 2.5 లక్షల వరకూ ఉచిత వైద్య చికిత్సలు ఆపై ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు ద్వారా భరించేలా చూడాలని స్పష్టం చేశారు. గతంలో కార్మికుల సంక్షేమం కోసం కనస్ట్రక్షన్ వర్కర్ వెల్ఫేర్ ఫండ్‌ను టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. కార్మికుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షకు కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆ శాఖ కార్యదర్శి ఎం.వి. శేషగిరి బాబు ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పామాయిల్ సాగు చరిత్రలో తొలిసారి ఏపీలోనే అధిక ధర

(మొదటి పేజీ తరువాయి)

ఈ చారిత్రాత్మక పరిణామానికి కారణమైన కూటమి ప్రభుత్వ నిర్ణయాల పట్ల పామాయిల్ రైతులు, పామాయిల్ అసోసియేషన్ సభ్యులు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇతర సంప్రదాయ పంటల నుంచి పామాయిల్ సాగు వైపు రైతులు పెద్ద సంఖ్యలో మొగ్గుచూపుతున్నారని, కూటమి ప్రభుత్వ విధానాల వల్ల తొలిసారి పామాయిల్ రైతులు నిజమైన సంతృప్తిని పొందుతున్నారని రైతులు ఈ సందర్భంగా తెలిపారు. ముఖ్యంగా సరైన సమయంలో ఉన్నతమైన గిట్టుబాటు ధరను ప్రకటించడం వల్ల రైతులకు ఆర్థిక భరోసా కలిగిందని, పామాయిల్ సాగు విస్తరణ వల్ల రాష్ట్రంలో క్రాప్ డైవర్సిఫికేషన్ విజయవంతంగా అమలవుతోందని రైతులు పేర్కొన్నారు. ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గంగా పామాయిల్ సాగు రైతులకు భరోసాగా మారిందన్నారు. అలాగే సాగు వ్యయాన్ని తగ్గించేలా డ్రిప్ పరికరాలపై సబ్సిడీని సరైన సమయంలో అందించడం ప్రభుత్వం తీసుకున్న అత్యంత కీలక నిర్ణయమని ప్రశంసించారు. పంట దిగుబడి వచ్చిన వెంటనే సరైన సమయంలో గిట్టుబాటు ధరను కల్పించడం వల్ల మార్కెట్ ఒడిదుడుకులకు భయపడాల్సిన అవసరం లేకుండా రైతులు సంతోషంగా ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని కేంద్రంగా చేసుకుని తీసుకుంటున్న నిర్ణయాలు పామాయిల్ సాగుకు కొత్త దిశను చూపుతున్నాయని రైతులు అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ దూరదృష్టి గల నిర్ణయాలతో రానున్న రోజుల్లో పామాయిల్ సాగు మరింత విస్తరిస్తుందని, రాష్ట్రం ఆయిల్ పామ్



ఉత్పత్తిలో అగ్రగామిగా నిలుస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు అండగా నిలిచిన, సీఎం చంద్రబాబు సారథ్యంలో, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నాయకత్వంలో వ్యవసాయ రంగం మరింత బలోపేతం అవుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

**రైతులకు రికార్డు ధర... మెట్రిక్ టన్నుకు రూ. 20,680 : మంత్రి అచ్చెన్నాయుడు**

2025-26 ఆయిల్ ఇయర్ (నూనె సంవత్సరం) కు గాను 20.01% ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియో (O-ER) ను ప్రభుత్వం ప్రకటించిందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. మన రాష్ట్ర పామ్ ఆయిల్ రైతులకు మెట్రిక్ టన్నుకు రూ. 20,680/- ధర లభించిందని, జనవరి నెలకు గాను తెలంగాణ రాష్ట్ర పామ్ ఆయిల్ రైతులకు మెట్రిక్ టన్నుకు రూ. 20,456/-లు లభించగా, మన రైతులకు రూ. 20,680/-ల ధర లభించిందని అన్నారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వల్ల తెలంగాణ కన్నా మన రైతులకు మెట్రిక్ టన్నుకు రూ. 224/- అదనంగా లభించిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఆయిల్ పామ్ విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకతలో దేశంలోనే తొలి స్థానంలో ఉందని, రాష్ట్రవ్యాప్తంగా 1.97 లక్షల మంది రైతులు 2.49 లక్షల హెక్టార్లలో ఆయిల్ పామ్ సాగు చేస్తూ, లాభదాయక పంటగా మలుస్తున్నారని అన్నారు. 2024-25 నూనె సంవత్సరానికి ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాల వల్ల ఆయిల్ పామ్ రైతులకు మెట్రిక్ టన్నుకు సగటున రూ. 19,579 ధర లభించిందని, ఇది గత పదేళ్లలోనే అత్యధికమని మంత్రి వెల్లడించారు. ఈ ధరలతో రైతుల్లో విశ్వాసం పెరిగి ఆయిల్ పామ్ సాగుపై సానుకూల వాతావరణం ఏర్పడిందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 24,535 హెక్టార్లలో కొత్త ఆయిల్ పామ్ తోటల విస్తరణ సాధించామని, ఇది గత దశాబ్దంలోనే రికార్డుగా నిలిచిందని తెలిపారు. ఇప్పటివరకు రూ. 181.28 కోట్ల నిధులు విడుదల చేసి, రూ. 137.28 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేశామని పేర్కొన్నారు. జాతీయ నూనె గింజల మిషన్ కింద రైతులకు ఉచిత మొక్కలు, సాగు ప్రోత్సాహకాలు, పరికరాలపై భారీ రాయితీలు అందిస్తూ ఆయిల్ పామ్‌ను రాష్ట్రంలో భవిష్యత్తు పంటగా అభివృద్ధి చేస్తున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# తిరుమల లడ్డూ కల్తీ... వైసీపీ తెలిసి చేసిన నేరం

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యవహారంలో ఎన్డీడీబీ జంతుకొవ్వు అవశేషాలు నిర్ధారించిందని, అలాంటి పరీక్షలు చేసే సామర్థ్యం తమ వద్ద లేదని ఎన్డీఆర్ఐ స్పష్టంచేసిందని తెలిపారు. అన్ని నివేదికలు ప్రసాదంలో వాడిన పదార్థాల్లో నెయ్యి లేదని నిర్ధారించాయని అన్నారు.

"ప్రతీమాట భక్తుల మనోభావాలు, సెంటిమెంటును దృష్టిలో పెట్టుకునే మాట్లాడుతున్నాం. దేవుడి విషయాన్ని రాజకీయం చేయకూడదనే నిష్ఠతోనే వ్యవహరిస్తున్నాం. కానీ ప్రజలకు వాస్తవాలు చెప్పకపోతే అది ఇంకా పెద్ద తప్పు అవుతుంది" అని పవన్‌కల్యాణ్ అన్నారు.

హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో తాము చాలా




స్పష్టంగా ఉన్నామని, కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరమేనని ఆయన పేర్కొన్నారు. 2022లోనే కల్తీ నిర్ధారణ అయినప్పటికీ ఆయోధ్యకు కూడా కల్తీ లడ్డూలు పంపి మహాపాపానికి ఒడిగట్టారని ఆరోపించారు.

వైఎస్సార్సీపీ పాలనలో పెద్ద ఎత్తున దేవాలయాలపై దాడులు జరిగినా చర్యలు తీసుకోలేదని విమర్శించిన పవన్‌కల్యాణ్, ఈ వ్యవహారంలో కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవాలను చూసి మౌనం పాటించడం సబబు కాదని అన్నారు. భక్తుల విశ్వాసాన్ని కాపాడేందుకు, దేవాలయాల పవిత్రతను నిలబెట్టేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

# కల్తీ వ్యవహారంపై ప్రజల ముందుకు నిజాలు



(మొదటి పేజీ తరువాయి)

"పాల సేకరణ చేయలేని డైరీకి నెయ్యి సరఫరా కాంట్రాక్టు ఇచ్చారు. నెయ్యి కాని పదార్థంతో లడ్డూలు తయారు చేసి భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారు. రివర్స్ టెండరింగ్ పేరుతో నిబంధనలను తుంగలో తొక్కి అవినీతికి పాల్పడ్డారు" అని మాధవ్ విమర్శించారు.

గత ప్రభుత్వంలో పవిత్ర మూర్తులపై దాడులు జరిగాయని, ఆలయాల నిధులను దుర్వినియోగం చేసినందుకు ప్రజలకు, భక్తులకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. "పవిత్రమైన నెయ్యి బదులు సింథటిక్ నెయ్యిని వినియోగించడం ఘోరమైన అపచారం. దీనికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని స్పష్టం చేశారు.

వైఎస్సార్సీపీ హయాంలో గతంలో జరిగిన అవినీతిపై ప్రక్షాళన చేసి పునర్నిర్మాణ దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని మాధవ్ తెలిపారు. "అన్ని దేవాలయాల పవిత్రతను కాపాడుతూ, హిందువుల మనోభావాలు గాయపడకుండా, ప్రజల విశ్వాసాన్ని కాపాడుతూ మంచి పాలన అందిస్తాం. భక్తుల అభిమానం తోడుగా తీసుకుని కూటమి సమిష్టిగా పనిచేస్తుంది" అని ఆయన చెప్పారు.

# హజ్ యాత్రకు కార్యాచరణ




(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ నగరంలోని లబ్బీపేట పద్మశాలీయ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమీక్షకు మైనారిటీ మంత్రి ఫరూక్ హాజరయ్యారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, సభ్యులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫారూక్ షుబ్లీ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల హజ్ సొసైటీలు, హజ్ యాత్ర ఇన్ స్పెక్టర్లు, శిక్షకులు, తదితరులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారందరికీ యాత్ర విజయవంతం కోసం, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, రవాణా, వసతి , భద్రత తదితర ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. జిల్లాల వారీగా ఉన్న హజ్ సొసైటీలు తమ తమ పరిధిలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్, యాత్రలో అవలంబించవలసిన విషయాలపై కూలంకషంగా వివరించేందుకు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇమిగ్రేషన్, మక్కాయాత్రలో అక్కడి వసతుల సౌకర్యాలు తదితర ఏర్పాట్లపై గత ఏడాది తరహాలోనే ఇన్ స్పెక్టర్లు దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు.

**విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుంచి వెళ్లే వారందరికీ రూ.లక్ష ఆర్థిక సాయం :** విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి పవిత్రమైన మక్కా హజ్ యాత్ర కు వెళ్లే ప్రయాణికులకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందించే ఒక లక్ష రూపాయల ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు. గన్నవరం ఎయిర్పోర్ట్ నుండి హజ్ కు వెళ్లే వారందరికీ రూ. లక్ష ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు మంజూరు చేసిందనే విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆదాయం తో నిమిత్తం లేకుండా విజయవాడ ఎంబార్కేషన్ నుంచి వెళ్లే యాత్రికులందరికీ మైనారిటీ సంక్షేమ శాఖ రూ.లక్ష సాయం అందిస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల ఎంబార్కేషన్ కేంద్రాల నుండి వెళ్లే యాత్రికుల విమాన చార్జీల కంటే ఎక్కువ మొత్తం విజయవాడ నుంచి వెళ్లే వారిపై పడుతున్న భారం తగ్గించేందుకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. గన్నవరం విమానాశ్రయం పరిసర జిల్లాల యాత్రికుల సౌకర్యార్థం, ఏపీ రాజధానిగా అమరావతి ప్రాముఖ్యతను మరింత పెంచేందుకు, విజయవాడ నుండి హజ్ కి వెళ్లే యాత్రికులందరికీ ప్రభుత్వం రూ. లక్ష ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రం నుండి హజ్ కి వెళ్లే వారంతా ఇకముందు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ప్రథమ ప్రాధాన్యతగా ఎంచుకుని కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. ప్రత్యేక సమీక్షా సమావేశంలో హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను వసూళ్ళ తీరుపై ఆరాతీసిన రీజియన్ డైరెక్టర్ హరికృష్ణ



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** పురపాలక సంఘాలకు ఆర్థిక వనరు ప్రజల నుండి, వారి స్థిరాస్తులకు పన్ను రూపేణ వచ్చె ఆదాయమేనని, ఆస్తి పన్ను వసూలు లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గుంటూరు రీజియన్ డైరెక్టర్ హరికృష్ణ సంబందిత విభాగం సిబ్బందికి సూచించారు. పురపాలక సంఘ పరిపాలనా విభాగం గుంటూరు రీజియన్ డైరెక్టర్ హరికృష్ణ గురువారం సాయంత్రం తెనాలి పురపాలక సంఘ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా పురపాలక సంఘ రెవిన్యూ విభాగం అధికారులతో, ఆస్తి పన్ను వసూళ్లపై సమీక్షించారు. గత సంవత్సరం వసూళ్ళ అధికంగా ఆస్తి పన్ను వసూలుకు చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మీడియాతొ మాట్లాడుతూ పురపాలక సంఘాలకు ప్రధాన ఆర్థిక వనరు ఆస్తిపన్ను మాత్రమె అన్నారు. పట్టణాభివృద్ధి కోసం ప్రజలు సకాలంలో ఆస్తి పన్ను చెల్లించాలని సూచించారు. రాష్ట్రంలో ఏటా రావాల్సిన ఆస్తిపన్నులో 70 నుంచి 75 శాతం మాత్రమె వసూలవుతోందని చెప్పారు. సకాలంలొ ఆస్తి పన్ను చల్లించక ఆలస్యం చేసినందున రెండు రూపాయల పెనాల్టి పడుతుందని గుర్తుచేశారు. తెనాలిలో గతేడాది రూ. 18 కోట్లు వసూలైందనీ, ఈసారి రూ. 21నుండి22 కోట్లు వసూలయే అవకాశం ఉందన్నారు. ఏప్రిల్ 1 నుండి 30వ తేదీలోగా ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లిస్తే అయిదు శాతం రాయితీ ఉంటుందని అన్నారు. ప్రజలు బకాయిల చెల్లింపుతోపాటు ఈ అవకాశాన్ని కూడా వినియోగించుకోవాలని కోరారు. ఈసమావేశంలొ మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## మండలంలొ పిహెచ్ సి సెంటర్ల మౌలిక అవసరాల సాధనకు ప్రాధాన్యత కల్పిస్తాం



**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్):** ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలల అభివృద్ధి కమిటీ సమావేశం లొ, తమ దృష్టికి వచ్చిన సమస్యలను ఈనెల ఏడున నిర్వహించే మండల పరిషత్ సాధారణ సమావేశం లొ,పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఎమ్పీడిఒ అత్తోట దీప్తి పేర్కొన్నారు.
స్థానిక కొత్తపేటలోని మండల అభివృద్ధి కార్యాలయంలో గురువారం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అడ్వైజరీ కమిటీ సమావేశం, హెచ్ డిఎస్ కమిటీ చైర్మన్, ఎమ్ పిపి ధర్మరాజుల చెన్నకేశవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈకమిటీలో సభ్యులైన మండల తహశీల్దార్ కెవి. గోపాలకృష్ణ,పిహెచ్ సి సెంటర్ల వైద్యులు పాల్గొన్నారు. సమావేశంలొ వచ్చిన సమస్యలను ఎమ్పీడిఒ అత్తోట దీప్తి మీడియాకు వివరించారు. ప్రధానంగా సంగం జాగర్లమూడి పిహెచ్ సి సెంటర్లో, టాయిలట్స్ ఏర్పాటు చేయాలన్నఅంశం, కొలకలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టాల్సిన అంశాలు ఉన్నాయన్నారు. సమావేశం దృష్టికి వచ్చిన అంశాల పరిష్కారం కోసం ఈనెల 7న, నిర్వహించే, మండల పరిషత్ సాధారణ సమావేశంలొ, నిర్ణయాలు తీసుకునే దిశగా కృషి చేస్తామన్నారు. సాధారణసమావేశానికి మండలంలోని అన్ని విభాగాల అధికారులు విధిగా హాజరు కావాలని ఎమ్పీడిఒ అత్తోట దీప్తి కోరారు. సమావేశంలొ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సిహెచ్. సుబ్బారావు, డాక్టర్ యు. దిలీప్, సీనియర్ అసిస్టెంట్ ఆర్సీ. నరశింహారావు, కొలకలూరు సర్పంచ్ చొప్పర ప్రీతి, కొల్లిపర సర్పంచ్ సిహెచ్. కుమారి తదితరులు పాల్గొన్నారు.

## డబ్ల్యూపీఎల్ విజేత ఆర్సీబీ...




వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్) సీజన్-4 టైటిల్‌ను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) మహిళలజట్టు గెలుచుకుంది. కోటాంబిలోని బిసిఎ స్టేడియంలో గురువారం జరిగిన ఫైనల్లో ఆర్సీబీ జట్టు ఆరు వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఘన విజయం సాధించింది. డబ్ల్యుపిఎల్ టైటిల్ చరిత్రలో 204పరుగుల భారీ లక్ష్యాన్ని ఒక జట్టు ఛేదించడం ఇదే తొలిసారి. భారీ ఛేదనలో భాగంగా బెంగళూరుకు శుభారంభం దక్కకున్నా... 2వ వికెట్‌కు కెప్టెన్ మంధాన, జార్జియో వోల్ 92బంతుల్లో 165 పరుగుల రికార్డు భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. బెంగళూరు గెలుపుకు 21 బంతుల్లో 30పరుగులు చేయాల్సిన దశలో వోల్(79; 54బంతుల్లో 14ఫోర్లు)ను మిన్నుమణి ఔట్ చేయడంతో ఢిల్లీ ఊపిరి పీల్చుకుంది. ఆ తర్వాత మంధాన(87; 41బంతుల్లో 12ఫోర్లు, 3సిక్సర్లు)కి తోడు చివర్లో రాధా యాదవ్(12నాటౌట్; 5బంతుల్లో 2ఫోర్లు కొట్టి మ్యాచ్‌ను ముగించారు. ఢిల్లీ బౌలర్లు హెన్రీకి రెండు, నందిని శర్మ, మిన్ను మణికి ఒక్కో వికెట్ దక్కాయి. అలాగే ఒక డబ్ల్యుపిఎల్ సీజన్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్ మంధాన రికార్డు పుటల్లోకెక్కింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ స్మృతి మంధానకు దక్కాయి.
టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి ఓపెనర్లు 49పరుగుల పునాదిని వేశారు. లిజెల్లి లీ-షెఫాలీ వర్మ కలిసి ధనా ధన్ ఇన్నింగ్స్‌తో చెలరేగడంతో ఢిల్లీ క్యాపిటల్స్ 5.5ఓవర్లలోనే ఈ స్కోర్ సాధించింది. ఈ క్రమంలో షెఫాలీ వర్మ(20)ను అరుంధతి రెడ్డి పెవిలియన్ పంపింది. దాంతో. 49 పరుగుల వద్ద వీరి భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి వస్తూనే లారా వొల్వార్డ్(44) మొదటి బంతిని బౌండరీకి పంపి, మరో ఎండ్‌లో లిజెల్లి లీ(37) దూకుడు పెంచారు. దీంతో ఢిల్లీ జట్టు పవర్ ప్లే 6ఓవర్లలో వికెట్ నష్టానికి 53 పరుగులు చేసింది. ఆ తర్వాత కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్(57; 37బంతుల్లో 8ఫోర్లు) వేగంగా పరుగులు రాబట్టింది. ఈ క్రమంలో రోడ్రిగ్స్‌ను సయాలీ సత్‌గైర్ ఔట్ చేయడంతో ఢిల్లీ జట్టు 148పరుగుల వద్ద మూడో వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత వోల్వర్ట్(44) చివరి బంతికి రనౌట్ కాగా. హెన్రీ(35నాటౌట్)తో కలిసి కీలక ఇన్నింగ్స్ ఆడింది. దీంతో ఢిల్లీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీస్కోర్ చేసింది. బెంగళూరు బౌలర్లు సయాలీ సత్‌గేర్, డి-క్లార్క్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.
స్కోర్‌బోర్డు...
ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల ఇన్నింగ్స్: లిజెల్లి లీ (సి)గ్రేస్ హారీస్ (బి)డి-క్లార్క్ 37, షెఫాలీ వర్మ (సి)రీచా ఘోష్ (బి)అరుంధతి రెడ్డి 20, వోల్వార్డ్ (రనౌట్)అరుంధతి రెడ్డి/రీచా ఘోష్ 44, జెమీమా రోడ్రిగ్స్ (సి)డి-క్లార్క్ (బి)సయాలీ సత్‌గేర్ 57, హెన్రీ (నాటౌట్) 35, అదనం 10. (20 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 203పరుగులు. వికెట్ల పతనం: 1/49, 2/72, 3/148, 4/203 బౌలింగ్: లారెన్ బెల్ 4-0-19-0, సయాలీ సత్‌గేర్ 4-0- 46-1, శ్రేయాంక పాటిల్ 2-0-32-0, డి-క్లార్క్ 4-0-48-1, రాధా యాదవ్ 2-0-18-0
రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మహిళల ఇన్నింగ్స్: గ్రేస్ హారీస్ (బి)హెన్రీ 9, మంధాన (బి)హెన్రీ 87, జార్జియా వోల్ (సి)షెఫాలీ వర్మ (బి)మిన్ను మణి 79, రీచా ఘోష్ (సి)మిన్ను మణి (బి)నందిని శర్మ 6, డి-క్లార్క్ (నాటౌట్) 7, రాధా యాదవ్ (నాటౌట్) 12, అదనం 4. (19.4ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 204పరుగులు. వికెట్ల పతనం: 1/9, 2/174, 3/181, 4/191 బౌలింగ్: మారిజానే కాప్ 4-0-38-0, హెన్రీ 4-0- 34-2, నందిని శర్మ 4-0-41-1, శ్రీచరణి 3.4-0-46-0, షెఫాలీ వర్మ 1-0-9-0, మిన్ను మణి 2-0-19-1, స్నేహ్ రాణా 1-0-15-0.

# ప్రతి ఎకరాకు నీరివ్వడమే నిజమైన జల హారతి

(మొదటి పేజీ తరువాయి)

హార్టికల్చర్ పై శ్రద్ధ పెట్టాం. నీటిని మనం సమర్థవంతంగా ఉపయోగించుకుంటే కరువు అనే మాటే వినపడదు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా మార్చుకోవాలి. పరిగెత్తే నీటిని నడిపించాలి. నడిచే నీటిని నిలబెట్టాలి. నిలిచిన నీటిని భూగర్భ జలాలుగా మార్చి భూమినే జలాశయంగా మార్చాలి. ఒకప్పుడు సీమ అంటే నీరు లేని ప్రాంతం. ఇప్పుడు కోస్తాంధ్రతో పోటీ పడి నీటి వృద్ధి చెందుతోంది."అని సీఎం చెప్పారు.



**క్షేత్రస్థాయిలో సాగునీటి సంఘాల పనితీరు బాగుంది** : "ప్రతి ఎకరాకు సాగునీరు ఇచ్చేలా తాగు నీటి సంఘాల అధ్యక్షులు కృషి చేయాలి. సమర్థ నీటి వినియోగంలో రైతుల భాగస్వామ్యం కీలకం. ఈ ఉద్దేశంతోనే 1997లో దేశంలోనే మొదటిసారిగా సాగు నీటి సంఘాలు ఏర్పాటు చేశాం. ఈ వ్యవస్థ ద్వారా 14 లక్షల నీటి సంరక్షణ కట్టడాలు నిర్మించాం. ఎంతో ప్రాధాన్యత కలిగిన సాగునీటి సంఘాలు గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురయ్యాయి. గత పాలకులు సాగునీటి సంఘాలు చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులు పెట్టారు. ఎన్డీఏ ప్రభుత్వంలో వారి బిల్లులన్నీ క్లియర్ చేశాం. 2024 డిసెంబర్లో 6,047 నీటి వినియోగదారుల సంఘాలకు, 267 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 58 ప్రాజెక్ట్ కమిటీలకు ఎన్నికలు నిర్వహించాం. నీటి సంఘాల అధ్యక్షులు పనులు సమర్థవంతంగా చేస్తున్నారు. నీటి వినియోగదారుల సంఘాలకు చెందిన ప్రతినిధులు 60 వేల మంది ఉన్నారు. సాగునీటి సంఘాల ప్రతినిధులంతా ఓ సైన్యం తలుచుకుంటే రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయగలరు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 344 కోట్లతో 7,197 ఆపరేషన్ అండ్ మేనేజ్మెంట్ పనులు రైతు సంఘాల ద్వారా చేపట్టాం. సాగు నీటి నిర్వహణ పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించే పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాం. కాలువల నిర్వహణ, నీటి పన్నుల వసూలు, వివాదాల పరిష్కారంలో నీటి వినియోగదారుల సంఘాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇస్తాం. సమర్థ నీటి నిర్వహణతో జలాశయాలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది నారు మళ్లకు మే 15 నాటికే నీరు అందిస్తాం."అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**ప్రతి ఎకరాకు నీరివ్వడమే నిజమైన జల హారతి** : "నదుల అనుసంధానం జరిగి, ప్రతి ఎకరాకు నీరు ఇవ్వగలిగితే అదే నిజమైన జల హారతి. 2014-19 మధ్య సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చాం. సాగునీటిపైనే రూ. 68 వేల కోట్లు ఖర్చు చేశాం. వ్యవసాయానికి 900 టీఎంసీలు, పరిశ్రమలకు 40 టీఎంసీలు, తాగు నీటి కోసం 200 టీఎంసీల నీరు అవసరం. ప్రతీ ఏటా 1300 టీఎంసీల నీటితో మన రాష్ట్ర అవసరాలు తీరతాయి. మన రాష్ట్రంలో గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార, నాగావళి వంటి 40 నదులు, 38 వేల చెరువులు ఉన్నాయి. వీటన్నిటిలో 1300 టీఎంసీలకు పైగా నీటిని నిల్వ చేసుకోగలం. ఈ ఏడాది 862 టీఎంసీల నీళ్లు మన జలాశయాల్లో ఉంది. మన ప్రాజెక్టులను ఈ ఏడాది గరిష్టంగా 91 శాతం మేర నింపాం. ప్రస్తుతం మన జలాశయాల్లో రూ. 846 టీఎంసీల మేర నీటి నిల్వలు ఉన్నాయి. ఏపీ జీవ నాడి పోలవరాన్ని గత ప్రభుత్వం గోదావరిలో కలిపేసింది. దుర్మార్గపు పాలనలో నిర్లక్ష్యం వల్ల డయాఫ్రాంవాల్ దెబ్బతిని అదనంగా రూ. 1000కోట్లు ఖర్చు అయ్యింది. సమయం కూడా వృధా అయ్యింది.
కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2027 జూన్ కంటే ముందే పోలవరం కల సాకారమై జాతికి అంకితం చేస్తాం. పోలవరం పూర్తి చేశాక నదుల అనుసంధానం చేపడతాం. పట్టి సీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీరిచ్చాం. పోలవరం లెఫ్ట్ మెయిన్ కెనాల్ మార్చి లోగా పూర్తి చేసి అనకాపల్లి, విశాఖకు నీరు అందిస్తాం. తారక రామ తీర్థసాగర్ సహా అన్ని ప్రాజెక్టులు రాబోయే మూడేళ్లలో పూర్తి చేసి ఉత్తరాంధ్రను సస్యశ్యామలం చేస్తాం. గోదావరి నీళు వంశ ధారకు అనుసంధానం చేస్తాం. పోలవరం నుంచి నీటిని నల్లమల సాగర్ కు తీసుకెళ్తాం. గత పాలకులు వెలిగొండ పూర్తి చేసినట్టు భ్రమ కల్పించారు. ఈ సీజన్ లోనే ప్రాజెక్టును పూర్తి చేసి కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తాం."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రాయలసీమ ఎత్తిపోతలతో మళ్లీ మభ్యపెట్టే ప్రయత్నాలు** : "ఈ ఏడాది గోదావరి నుంచి 5000 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయింది. 200 టీఎంసీల వరద జలాలు పోలవరం నుంచి నల్లమల సాగర్ కు తీసుకొస్తాం. తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మిస్తుంటే మేము ఏనాడు అడ్డు చెప్పలేదు. ఇదే తరహా స్పందనను తెలంగాణ నుంచి కోరుకుంటున్నాం. హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలు చిత్తూరు, మడకశిరకు తీసుకొచ్చాం. రాష్ట్రంలోని అన్ని చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయి. అప్పుడు కరువు అనే మాట వినపడదు. మొన్నటి వరకూ ఇంజనీర్లే ప్రణాళికలు తయారు చేసేవారు. నేడు మన సాగునీటి సంఘాల అధ్యక్షులు ఇంజనీర్లు కావాలి. వినూత్న ఆలోచనలతో నీటి సమస్యలు పరిష్కారం చేయాలి. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీ చేసి మహాపాపం చేశారు. ఘోర అపచారం చేశారు. రసాయనాలతో నెయ్యి తయారు చేసి ప్రసాదంలో వినియోగించారని తేలింది. వారు చేసిన అపచారం క్షమార్హం కాదు. కూటమి అధికారంలోకి వచ్చాక 20 లక్షల కోట్ల పెట్టుబడులతో పరిశ్రమలు వస్తున్నాయి. 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ప్రధాని మోదీ, మిత్రుడు పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. ఇతరులపై బురద చల్లటం వైసీపీకి అలవాటైంది. రాయలసీమ ఎత్తిపోతల ద్వ ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక పెద్ద ఎత్తున మన రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయి. రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో ముందుకెళుతోంది. మిత్రుడు పవన్ కల్యాణ్ తో కలిసి రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తున్నాం. ఇతరులపై బురద వేయడం వైసీపీ వాళ్లకు అలవాటైంది. రాయలసీమ ఎత్తిపోతల అంశంతో మళ్లీ ప్రజల్ని మభ్యపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా ప్రారంభించిన ఆ ప్రాజెక్టును ఎన్జీటీ నిలిపేసింది. అప్పుడు పట్టించుకోకుండా ఇప్పుడు మళ్లీ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు. మచ్చుమర్రి, పోతిరెడ్డిపాడు ద్వారా అన్ని ప్రాంతాలకూ నీరసిస్తాం. బ్రహ్మంసాగర్, గండికోట, చెర్లోపల్లి తదితర ప్రాజెక్టులకు నీరు రావటం ఎన్డీఏ ఘనతే. సీమలో నీటి ఇబ్బందులు రాకుండా చూస్తాం. అని ముఖ్యమంత్రి అన్నారు. నీటి వినియోగదారుల సంఘాల సమావేశానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, కె.అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ సహా పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# కాంగ్రెస్ విమర్శలు హాస్యాస్పదం



**● బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** యూపీఏ ప్రభుత్వ హయాంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అవినీతికి కేంద్రంగా మార్చిన కాంగ్రెస్ పార్టీ, నేడు ఎన్డీఏ ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న వికసిత భారత్ - గ్యారంటీ ఫర్ రోజ్గర్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీ-ణ్) - 'వీబీ-జీ రాం జీ' పథకంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ వ్యాఖ్యానించారు.
బుధవారం శ్రీసత్యసాయి జిల్లా పర్యటన సందర్భంగా పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి చేసిన వ్యాఖ్యలకు స్పందించిన మాధవ్ మాట్లాడుతూ, యూపీఏ ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు ఉపాధి హామీ పథక నిధుల్లో అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని గుర్తుచేశారు. అదే కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తున్న కొత్త పథకంపై విమర్శలు చేయడం "దెయ్యాలు వేదాలు వల్లించినట్లు" ఉందన్నారు.
మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని మరింత విస్తృతంగా, ఆధునికంగా రూపుదిద్దుతూ మోదీ ప్రభుత్వం వీబీ-జీ రాం జీ పథకాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఇది పూర్తిగా పారదర్శకంగా అమలవుతూ గ్రామీణ కూలీలకు మరింత భరోసా కల్పిస్తున్నదని చెప్పారు. రాముడి పేరు వినిపిస్తే కాంగ్రెస్ పార్టీకి, వైఎస్ షర్మిలకు ఎందుకింత అసహనం? అని ప్రశ్నించారు.
కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రయోజనాల కోసమే మహాత్మా గాంధీ పేరును ఉపయోగించుకుందని, వాస్తవంగా ఆయన సిద్ధాంతాలను ఆ పార్టీనే ఖూనీ చేసిందని మాధవ్ ఆరోపించారు. గతంలో ఉపాధి హామీ పథకం కాంగ్రెస్ నేతలకు అవినీతి సాధనంగా మారిందని, వారి హయాంలో పథక అమలులో అనేక అక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వచ్చిన తర్వాతే ఈ పథకంలో పారదర్శకత, సమర్థత వచ్చిందన్నారు.
గతంలో ఏడాదికి 100 రోజులు మాత్రమే ఉపాధి కల్పించేవారని, ఎన్డీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన 'వీబీ-జీ రాం జీ' పథకం ద్వారా గ్రామీణ కూలీలకు 125 రోజుల వేతన హామీ ఉపాధి కల్పిస్తున్నామని మాధవ్ తెలిపారు. ఈ మెరుగైన విధానం వల్ల గ్రామీణ ప్రజలకు మరింత ఆదాయ భరోసా లభిస్తోందని, అదే విషయం కాంగ్రెస్‌కు కంటగింపుగా మారిందన్నారు.
"అభివృద్ధి చెందిన భారత్" అనే జాతీయ దార్శనికతకు అనుగుణంగా గ్రామీణాభివృద్ధికి స్పష్టమైన మార్గాన్ని ఈ కొత్త పథకం వేస్తోందని మాధవ్ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెంచుతూ, అవినీతి అస్కారం లేకుండా, ప్రజలకు నిజమైన లబ్ధి చేకూరేలా ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు.

# భగవంతుడు ఊరుకోరు - కల్తీ ప్రసాదం మహాపాపం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగంతో డబ్బు దోచుకోవడంతో పాటు శ్రీవారి పవిత్రత దెబ్బతీ-యాలనేదే అసలైన కుట్ర అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భగవంతుడు అంటే లెక్క లేదు... హిందూమతం అంటే విశ్వాసం లేదని, కల్తీ నెయ్యి వ్యవహారంలో దుష్ప్రచారం చేస్తున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. తిరుమల లడ్డూ విషయంలో గత పాలకులు మహా పాపం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సీఎం క్యాంపు కార్యాలయంలో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, మంత్రులు లోకేష్, సత్యకుమార్, పార్థసారధి, ఆనం రామనారాయణరెడ్డి, కేశవ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. భేటీ అనంతరం ఉమ్మడిగా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."తిరుమల లడ్డూ తయారీకి కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారం ప్రజలు, భక్తుల మనోభావాలకు సంబంధించింది. గత పాలనలో శ్రీవారి ప్రసాదం విషయంలో అపచారం చోటు చేసుకుంది. ఏడు కొండలవాడికి రెండు కొండలు చాలు అని నాడు అన్నారు. గత పాలనలో తిరుమల విషయంలో ఘోర అపచారానికి పాల్పడ్డారు. భక్తుల మనోభావాలతో ఆడుకున్నారు. 2022లో సీఎఫ్‌టీఆర్ఐ చాలా స్పష్టంగా కల్తీ జరుగుతోందని చెప్పినా పట్టించుకోకుండా యథేచ్ఛగా కొనసాగించారు. లక్షల మంది భక్తులకు అదే కల్తీ నెయ్యిని వాడిన లడ్డూను ప్రసాదంగా ఇచ్చి గత పాలకులు మహా పాపానికి పాల్పడ్డారు. గత ఐదేళ్లలో లడ్డూ ప్రసాదం తినాలంటేనే భక్తులు భయపడిన పరిస్థితి. మానసికంగా ఇబ్బందులు పడ్డారు. 2022లో వచ్చిన నివేదికను తొక్కిపెట్టారు. ఉద్దేశపూర్వకంగా అక్రమాలు చేయడానికే గత పాలకులు నాటి నివేదికను దాచేశారు. గతంలో పని చేసిన చైర్మన్ పీఏ రూ. 4 కోట్ల డబ్బులు లంచంగా తీసుకున్నారు"అని సీఎం వెల్లడించారు.

**నాడు తెలిసే తప్పు చేసి..నేడు ఎదురు దాడి** : "అధికారంలోకి వచ్చాక అన్ని రంగాల్లో ప్రక్షాళన చేయటంలో భాగంగా తిరుమల పవిత్రతను కాపాడేలా చర్యలు తీసుకున్నాం. నెయ్యి ట్యాంకర్ల నుంచి శాంపిళ్లు తీయించాం. శాంపిళ్లు తీసి ఎన్డీడీబీకి పంపాం. ఇక సిట్ నివేదిక చూస్తే అన్ని రసాయనాలు, పామాయిల్‌తో నెయ్యి తయారు చేసినట్టు వెలుగు చూసింది. భగవంతుడు అంటే లెక్కలేని తనంగా వ్యవహరించారు. హైందవం పట్ల జగన్ కు విశ్వాసం లేదు. తిరుమల లడ్డూ విషయంలో దుర్మార్గం, మహాపాపం చేశారు. చరిత్రలో శ్రీవేంకటేశ్వర స్వామితో ఎవరూ ఆటలాడుకోలేదు. బ్రిటీషర్లు కూడా సంప్రదాయాలు, ఆచారాలను గౌరవించారు. వాళ్లకంటే హీనంగా గత పాలకులు వ్యవహరించారు. నాడు లడ్డూ కల్తీకి పాల్పడిందే కాక ఇప్పుడు మళ్లీ ఎదురుదాడి చేసి, జరిగిన ఘటనను డైవర్ట్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. సీబీఐ నివేదికలో కల్తీలేదని ఎక్కడా నిర్ధారించలేదు. కరడు గట్టిన నేరస్తులు అసత్యాన్ని ఎలా నమ్మించాలో ప్రయత్నిస్తారు. ఇప్పుడు వైసీపీ అదే పని చేస్తోంది. ఏ ల్యాబ్‌లో అయినా ఒకే తరహా నివేదిక వచ్చింది. టీటీడీ బోర్డు చైర్మన్ కు, పర్చేజ్ కమిటీకి తెలిసే ఈ నిర్ణయాలు జరిగాయి. ఇప్పుడు వాళ్లే ఎదురు దాడి చేస్తున్నారు. దౌర్జన్యం, రౌడీయిజం చేయాలనుకుంటే మీ ఆటలు సాగవు. గత పాలనలో అంతర్వేది రథం తగలబెడితే, రామతీర్థంలో విగ్రహం ధ్వంసం చేస్తే చర్యలు తీసుకోకుండా తిరిగి మాపైనే ఆరోపణలు చేశారు. బూతులు తిట్టినా భరించాను. వారు ఏం చేసినా నిస్సహాయంగా మిగిలిపోవాలా? నాడు వివేకానందరెడ్డిని హత్య చేసి నాపై ఆరోపణలు చేశారు. ఇప్పుడు శ్రీవారి ప్రసాదం కల్తీ చేసి మళ్లీ ఆరోపణలు చేసే ప్రయత్నం చేస్తున్నారు. భక్తుల విశ్వాసం, నమ్మకంపైనా దాడి చేస్తున్నారు" అని ముఖ్యమంత్రి మండిపడ్డారు.

**పరకామణి చోరీని సెటిల్మెంట్లు చేస్తారా?** : "జగన్ మోహన్ రెడ్డికి వేంకటేశ్వరస్వామిపై భక్తి ఉంటే డిక్లరేషన్ పై ఎందుకు సంతకం పెట్టలేదు.? అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం కూడా డిక్లరేషన్ పై సంతకం చేశారు. టీటీడీ నిబంధనల ప్రకారం అన్యమతస్తులు డిక్లరేషన్ పై సంతకం చేయాల్సిందే. డిక్లరేషన్ ఇవ్వకుండా ఇష్టానుసారం వ్యవహరించిన వ్యక్తులు మాపై నిందారోపణలు వేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన దోషులు ఎవరైనా, ప్రజల మనోభావాలతో ఆడుకున్న వారిని ఉపేక్షించే సమస్యే లేదు. మానవ సేవే..మాధవ సేవ అంటాం. అలాంటి ఆ భగవంతుడి ప్రసాదాన్నే కల్తీ చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి పవిత్రతను దెబ్బతీయడానికి కావాలనే చేసిన పనిగా మేం భావిస్తున్నాం. పామాయిల్, లాక్టిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్ లాంటి రసాయనాలు ప్రసాదంలో ఉన్నప్పుడు మహాపాపం కాదా? ప్రజల నమ్మకాన్ని దెబ్బతీయడానికి వీళ్లెవరు. ప్రశ్నిస్తే ఎదురు దాడి చేస్తారా.? ఇష్టప్రకారం చేస్తాను అనే వ్యక్తులకు ప్రజలే సమాధానం చెబుతారు. 219 ఆలయాలపై గత పాలకులు దాడి చేసి అపవిత్రం చేసే ప్రయత్నం చేశారు. శ్రీవారి పరకామణిలో చోరీ కేసులో సెటిల్మెంట్ చేసే ప్రయత్నం చేస్తారా.? ఇదెక్కడి విడ్డూరం? జరిగిన తప్పును సమర్థించేసి సెటిల్ చేయాలని ప్రయత్నం చేసే వ్యక్తులను ఏమనాలి..? నెయ్యి కల్తీ జరగలేదని సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చిందని నివేదికలో ఎక్కడుంది..? ఏమైనా కలకన్నారా.? క్షమించరాని మహాపాపం చేశారు. ఈ మహాపాపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించలేం. ఉద్దేశపూర్వకంగానే శ్రీవేంకటేశ్వరస్వామిని అపవిత్రం చేయడానికి కుట్ర చేశారు. అన్ని నివేదికలనూ ప్రజల ముందే ఉంచుతాం. తిరుమల శ్రీవారి పవిత్రతను కాపాడుకోవటం మనందరి బాధ్యత. ఈ తరహా విషయాలను ముక్తకంఠంతో ఖండించాలి. తిరిగి ఈ తరహా మహాపచారం చేయాలంటే భయపడాలి. కల్తీ నెయ్యి వ్యవహారాన్ని వదిలిపెట్టబోం. దోషులను కఠినంగా శిక్షించడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటుంది. తిరుమల పవిత్రతను కాపాడతాం, అదే మాధవ సేవ. ఈ అంశంపై పీఠాధిపతులలోనూ చర్చించి ముందుకు వెళ్తాం."అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

**బూతులు తిడితే సహించాలా?** : "ఇష్టానుసారంగా బూతులు మాట్లాడితే సహించాలా. అసెంబ్లీలో నా కుటుంబంపై మాట్లాడిన బూతుల కారణంగా జీవితంలో తొలిసారి నేను కన్నీళ్లు పెట్టుకున్నాను. ఇప్పుడు మళ్లీ అదే తరహా నన్ను విమర్శిస్తున్నారు. బూతులు తిట్టిన వారిని వెనకేసుకొస్తున్నారు. ఇదీ వారి నైజం. నేను శ్రీ వారి భక్తుడ్ని. శ్రీ వేంకటేశ్వర స్వామి మా ఇంటి కులదైవం. 2003లో టీటీడీలో ప్రాణదానం కార్యక్రమం చేపట్టాం. శ్రీవారి కృపతోనే 23 క్లైమోర్ మైన్స్ దాడి నుంచి బయపడ్డాను. శ్రీ వేంకటేశ్వర స్వామి నాకు పునర్జన్మ ఇచ్చారు"అని సీఎం చంద్రబాబు చెప్పారు.



## వరల్డ్ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

### క్యాన్సర్ భయపడాల్సిన వ్యాధి కాదు: డా. జగన్మోహనరావు

**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 05 (జర్నలిస్ట్ ఫైల్)**

వరల్డ్ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగిరిపల్లిలోని స్థానిక పాఠశాలలో ప్రముఖ వైద్యులు డా. జగన్మోహనరావు విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్యాన్సర్ అనేది భయపడాల్సిన వ్యాధి కాదని, సరైన సమయంలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. క్యాన్సర్ రావడానికి గల కారణాలు, లక్షణాలు, నివారణ చర్యల గురించి పిల్లలకు సులభమైన భాషలో వివరించారు. ముఖ్యంగా పొగాకు, గుట్కా, మద్యం వంటి అలవాట్లు క్యాన్సర్‌కు ప్రధాన కారణాలని పేర్కొంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలి, సమతుల ఆహారం, క్రమమైన వ్యాయామం ద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చని సూచించారు. చిన్న వయసు నుంచే మంచి అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో ఆరోగ్య సమస్య లను దూరం చేసుకోవచ్చని చెప్పారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించడం ఎంతో ముఖ్యమని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ బీవీఎస్ లక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం డా. జగన్మోహనరావును పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## రక్షణ శాస్త్రవేత్తల మహాసభకు వేదికగా ఎన్ఆర్ఐ సంస్థలు

### ఫిబ్రవరి 5, 6న డిఫెన్స్ సైన్స్ కాన్‌క్లేవ్




**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 05 (జర్నలిస్ట్ ఫైల్)**

ఆగిరిపల్లి సమీపంలోని ఎన్ఆర్ఐ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో డిఫెన్స్ సైన్స్ కాన్‌క్లేవ్ నిర్వహించనున్నట్లు సంస్థల చైర్మన్ డా. ఆర్. వెంకట్ రావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మరియు హైదరాబాద్‌కు చెందిన ఎస్‌టీసీ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. డీఆర్‌డీఓ మాజీ చైర్మన్, నీతిఆయోగ్ సభ్యులు డా. విజయ్ కుమార్ సరస్వత్ ముఖ్య అతిథిగా హాజరై, 2026 ఫిబ్రవరి 6న ఉదయం 9.30 గంటలకు కాన్‌క్లేవ్‌ను ప్రారంభించనున్నారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా. సి. నాగ భాస్కర్ మాట్లాడుతూ, మొదటి రోజు ఫిబ్రవరి 5న "యంగ్ సైంటిస్ట్ కాన్‌క్లేవ్" నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి ఐజీసీఏఆర్ మాజీ డైరెక్టర్ డా. బి. వెంకట్రామన్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. యువ శాస్త్రవేత్తలు, విద్యార్థులు ఓరల్ మరియు పోస్టర్ ప్రెజెంటేషన్ల ద్వారా తమ పరిశోధనా ప్రతిభను ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. ఎస్‌టీసీ కార్యదర్శి సి.ఎల్. నరసింహ రావు మాట్లాడుతూ, ప్రముఖ శాస్త్రవేత్త డా. సూరి భగవంతం వర్ధంతి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషమన్నారు. యువతలో రక్షణ రంగ పరిశోధనపై ఆసక్తిని పెంపొందించడమే కాన్‌క్లేవ్ లక్ష్యమని వివరించారు. కళాశాల సీఈఓ ఎం. సాయి తేజ్ మాట్లాడుతూ, యంగ్ సైంటిస్ట్ కాన్‌క్లేవ్‌లో ప్రధాన ఆకర్షణగా రాకెట్ లాంచింగ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

## ప్రపంచ కప్ పోటీల పతాక విజేత హనీత్ నాగ్

### గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం






**గన్నవరం, ఫిబ్రవరి 05 (జర్నలిస్ట్ ఫైల్)**

ఢిల్లీ లో ఫిబ్రవరి 1 వ తేదీ నుండి 3 వ తేదీ వరకు జవహర్ లాల్ నెహ్రూ క్రీడాప్రాంగణంలో నిర్వహించిన రెండవ షూటింగ్ బాల్ ప్రపంచ కప్ పోటీలలో రజత పతకం సాధించిన విజయవాడ వాసి హనీత్ నాగ్ కి బుధవారం గన్నవరం విమానాశ్రయంలో గన్నవరం వీఆర్‌ఓ రాకీబ్, పెద్దలు చైతన్య, సుధీర్, దావీదు, రెమల్లి రాజేష్, సి హెచ్.వెంకటేశ్వరావు,సాయి బాబు, పాపట్ల రవి , సీనియర్ క్రీడాకారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హనీత్ మీడియాతో మాట్లాతూ తాను గత 8 సంవత్సరాలనుండి నుండి షూటింగ్ బాల్ క్రీడను శిక్షకులు విజయ్ గోగులమూడి వద్ద శిక్షణ పొందుతూ శిక్షణ మాత్రమే కాకుండా పోటీలలో ఆర్థికంగా, మనో ధైర్యంగా అన్ని అన్నివిధాలా సహకరించరన అన్నారు. అనంతరం హనీత్ కృష్ణా జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ సంఘం అధ్యక్షులు అట్లూరి రాజశేఖర్, గన్నవరం నియోజకవర్గ మీడియా మిత్రులు, బాపట్ల కిరణ్ కుమార్ , నిడమర్తి డేవిడ్, మురళి, వెంకటేశ్వరరావు , రేమల్లి రాజేష్ , మాస్టర్ బాపట్ల రవి కుమార్, గోగులమూడి సాయిబాబు, మీడియా మిత్రుల బృందం పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు. హనీత్ మీడియా మిత్రులకు క్రీడాకారులకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## అమరావతిలో ముఖ్యమంత్రిని కలిసిన కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం

- పీఏసిఎస్, బ్యాంక్ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం

**అమరావతి, ఫిబ్రవరి 05 (జర్నలిస్ట్ ఫైల్)**



కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (కేడీసీసీ బ్యాంక్) చైర్మన్ నెట్టెం రఘురాం అమరావతిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాదపూర్వకంగా కలిసి, బ్యాంక్ పరిధిలో పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పీఏసిఎస్) మరియు వాటి ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు పరిపాలనా, ఉద్యోగ సంబంధిత సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కేడీసీసీ బ్యాంక్ పరిధిలోని పీఏసిఎస్ సంఘాల్లో సీఈఓ పోస్టులు ఖాళీగా ఉండటంతో పరిపాలనలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆయన ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న అర్హులైన ఉద్యోగులకు ఒకసారి ప్రత్యేక ప్రమోషన్లు పరిశీలించాలని కోరారు. అలాగే పలు గ్రామీణ పీఏసిఎస్ సంఘాలు డైలీవేజ్ సిబ్బందిపై ఆధారపడి పనిచేస్తున్నాయని, అర్హత పరీక్ష నిర్వహించి అర్హులైన వారికి న్యాయబద్ధంగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కేడీసీసీ బ్యాంక్ మరియు పీఏసిఎస్ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా 62 సంవత్సరాలకు పెంచితే అనుభవజ్ఞులైన సిబ్బంది సేవలు మరింత కాలం అందుబాటులో ఉంటాయని తెలిపారు. కొన్ని వేతనాలు "సస్పెన్స్ ద్యూ టు అకౌంట్" కింద నిల్వ ఉండటంతో ఆర్థిక లావాదేవీల్లో సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటిని క్రమబద్ధీకరించేందుకు తగిన మార్గదర్శకాలు జారీ చేయాలని ఆయన కోరారు. అవసరమైన విద్యార్హతలు పొందేందుకు గతంలో ఇచ్చిన గడువును మరికొంత కాలం పొడిగిస్తే గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన ఉద్యోగులకు ఉపశమనం కలిగి, వారి ఉద్యోగ భద్రత కాపాడబడుతుందని వివరించారు. ఈ వినతులు ఉద్యోగుల ప్రయోజనాలతో పాటు గ్రామీణ సహకార వ్యవస్థ బలోపేతానికి, రైతులకు నిరంతర సేవలందించేందుకు దోహదపడతాయని నెట్టెం రఘురాం తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వినతులను శ్రద్ధగా విని, సంబంధిత శాఖలతో పరిశీలించి సాధ్యమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నెట్టెం రఘురాం వెల్లడించారు.

## ఎల్‌బీఆర్‌సీఈ అధ్యాపకులు, విద్యార్థుల ప్రతిభ

- ఎన్‌పీటీఎల్‌లో 'ఏ' గ్రేడ్ సాధించిన లోకల్ చాప్టర్

**మైలవరం, ఫిబ్రవరి 05 (జర్నలిస్ట్ ఫైల్)**



ఐఐటీలు, ఐఐఎస్సీ సంయుక్తంగా ప్రారంభించిన ఎన్‌పీటీఎల్ (నేషనల్ ప్రోగ్రామ్ ఆన్ టెక్నాలజీ ఎన్‌హాన్స్‌డ్ లెర్నింగ్) ద్వారా ఆన్‌లైన్‌లో అనేక ఎంఓఓసీ కోర్సులు అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ కోర్సులకు ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులకు ధ్రువపత్రాలు అందజేస్తుండగా, వాటికి ఉద్యోగావకాశాల్లో ప్రాధాన్యత లభిస్తున్నది. ఎన్‌పీటీఎల్ సంస్థతో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల (ఎల్‌బీఆర్‌సీఈ) అవగాహన ఒప్పందం కుదుర్చుకొని, పరస్పర సహకారంతో వనరులను వినియోగిం చుకుంటూ అధ్యాపకులు, విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి కృషి చేస్తోంది. ఎన్‌పీటీఎల్ ఆధ్వర్యంలో 2025 అక్టోబర్ 25, 26, 27 తేదీలలో నిర్వహించిన పరీక్షల్లో ఎల్‌బీఆర్‌సీఈ అధ్యాపకులు, విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఈ ప్రతిభకు గాను ఎల్‌బీఆర్‌సీఈ ఎన్‌పీటీఎల్ లోకల్ చాప్టర్‌కు దేశవ్యాప్తంగా 100--200 బ్యాండ్‌లో "యాక్టివ్ లోకల్ చాప్టర్"గా గుర్తింపు పొందుతూ 'ఏ' గ్రేడ్‌ను ఎన్‌పీటీఎల్ సంస్థ ప్రదానం చేసింది. వివిధ విభాగాలకు చెందిన మొత్తం 1,737 మంది అధ్యాపకులు, విద్యార్థులు ఉత్తీర్ణులవగా, వారిలో 13 మంది టాపర్లుగా నిలిచారు. 12 మందికి 'ఎలైట్ ప్లస్ గోల్డ్', 171 మందికి 'ఎలైట్ ప్లస్ సిల్వర్', 832 మందికి 'ఎలైట్', 722 మందికి సాధారణ ధ్రువపత్రాలు లభించాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాస రెడ్డి, ప్రిన్సిపాల్ డా. కె. అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ డా. బి. రమేష్ రెడ్డి, డీన్స్, ఎల్‌బీఆర్‌సీఈ ఎన్‌పీటీఎల్ లోకల్ చాప్టర్ స్పోక్ శ్రీ జె.వి. పవన్ చంద్ (ఈఈఈ, సీనియర్ అసిస్టెంట్ (ప్రొఫెసర్) తదితరులు అధ్యాపకులు, విద్యార్థులను అభినందించారు.

## కూటమి ప్రభుత్వంలో పారదర్శకంగా రెవెన్యూ సేవలు

- ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ శిరీష దేవి

**రంపచోడవరం, ఫిబ్రవరి 05 (జర్నలిస్ట్ ఫైల్)**



రెవెన్యూ శాఖ సేవల్లో కూటమి ప్రభుత్వం పూర్తి పారదర్శకతతో పనిచేస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్పర్సన్ మిరియాల శిరీషదేవి పేర్కొన్నారు. బుధవారం పోలవరం జిల్లా రంపచోడవరం మండలం సీతపల్లి గ్రామంలో తహసిల్దార్ బాలాజీ అధ్యక్షతన జరిగిన 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమంలో పాల్గొని అధికారులతో కలిసి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వంలో రైతుల పట్టాదారు పాస్ పుస్తకాలపై జగన్మోహన్ రెడ్డి బొమ్మతో పంపిణీ చేశారని దుయ్యబట్టారు. ఆయన చేసిన పని సొమ్ము ఒకడిది సోకు ఒకడిది అన్న చందంగా ఉన్నట్లు ఎద్దేవా చేశారు. భూ యజమానులకు ఉండాల్సిన హక్కులు లేకుండా నియంతలా దారుణంగా వ్యవహరించారు అన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా బాధ్యతాయుతంగా పనిచేస్తున్నట్లు రాష్ట్రంలో రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో, ఎమ్మెల్యే పదిహేను మంది రైతులుకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. రెవెన్యూ సేవలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న త్వరితగతిని పరిష్కారం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం నుండి ఐవిఆర్ఎస్ ఫోన్ కాల్స్ లో మీ యొక్క అభిప్రాయం స్పష్టంగా చెప్పాలని ఎమ్మెల్యే కోరారు కూటమి ప్రభుత్వం పటిష్టంగా చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల భాగస్వామ్యం ఆశీస్సులు ఉండాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్ ఏఎంసీ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు సర్పంచ్ పండ్ర సరస్వతి ఎంపీటీసీ మర్రి పాపారావు రంపచోడవరం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు షేక్ చోటు ,సీతపల్లి దేవస్థానం చైర్మన్ సభ్యులు సిద్ధ వెంకన్న దొర, అధికారులు రెవెన్యూ ఇన్స్పెక్టర్ నిర్మల కుమారి వీఆర్వో కే అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## సత్తెనపల్లిలో 'చాయ్ రస్తా' అవుట్‌లెట్ ప్రారంభం

- ఎస్ హెచ్ జి మహిళల ఆర్థిక స్వావలంబనకు కొత్త ఊపిరి

**సత్తెనపల్లి, ఫిబ్రవరి 05 (జర్నలిస్ట్ ఫైల్)**




"ఒక కుటుంబం – ఒక వ్యాపారవేత్త" పథకం అమలులో భాగంగా మెప్మా స్వయం సహాయక సంఘాల మహిళల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'చాయ్ రస్తా' అవుట్‌లెట్‌ను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ బుధవారం తాలూకా సెంటర్‌లో ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన మొదటి కప్పు చాయ్‌ను కొనుగోలు చేసి దాని రుచి, పరిశుభ్రత, నాణ్యతను ప్రశంసించారు. ఐఐఎం, ఐఐటీ పట్టభద్రుల సహకారంతో రూపుదిద్దుకున్న ఈ వినూత్న వ్యాపార నమూనాను అభినందిస్తూ, మహిళలకు స్థిరమైన ఆదాయం కల్పించడంలో మెప్మా చేస్తున్న కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణమాట్లాడుతూ, ""చాయ్ రస్తా' వంటి కార్యక్రమాలు మహిళలకు స్థిరమైన నెలవారీ ఆదాయంతో పాటు గౌరవప్రదమైన జీవనోపాధిని అందిస్తాయి. ఇది సమాజ ఆర్థిక బలాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది" అన్నారు. సంప్రదాయ నైపుణ్యాలను ఆధునిక వ్యాపార విధానాలతో మేళవిస్తూ మహిళా వ్యాపారవేత్తలను శక్తివంతం చేయాలనే లక్ష్యంతో 'చాయ్ రస్తా' మోడల్‌ను రూపొందించినట్లు తెలిపారు. మెప్మా సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా పట్టణాలు, నగరాల్లో మరిన్ని అవుట్‌లెట్లు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి సూచించిన "ఒక కుటుంబం – ఒక వ్యాపారవేత్త" పథకం ద్వారా ప్రతి కుటుంబంలో కనీసం ఒకరు వ్యాపారవేత్తగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇద్దరు హెచ్ ఆర్ పిలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అలాగేబ్యాంకు లింకేజీ ద్వారా 28 సంఘాలకు రూ.4.85 కోట్ల చెక్కులు, ముద్ర యోజన, స్వయం సిద్ధ పథకాల ద్వారా 100 మంది సంఘ సభ్యులకు రూ.2 కోట్ల చెక్కులు,పీఎం స్వానిధి పథకం కింద వీధి వ్యాపారులకు రూ.37.75 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, చాయ్ రస్తా ప్రతినిధులు కిరణ్, పూర్ణ, ఎస్ హెచ్ జి సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పల్నాడు జిల్లా టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు దారువూరి నాగేశ్వరరావు, సత్తెనపల్లి తెలుగు మహిళా అధ్యక్షురాలు అంబికా, ఎల్ హెచ్ ఉమర్వలి, డిఎంసి పద్మజ, సిఓలు శ్రీలక్ష్మి, ఝాన్సీ, శ్రీనివాస్, ఆర్ పిలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించండి

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్



ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా లోని ఐదు మున్సిపాలిటీలలో నామినేషన్ సజావుగా జరిగిందని, రెబెల్ అభ్యర్థులు అందరి కుడా విరమించుకొన్నారని, జిల్లా నాయకులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు, అభిమానులు అందరు సమిష్టిగా కృషి చేయాలని తద్వారా అన్ని మున్సిపాలిటీలలో కాంగ్రెస్ విజయబావుటా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికీ ఏదులాపురం మున్సిపాలిటీలో ఒక వార్డు కౌన్సిలర్ ఏకగ్రీవం అయిందని శ్రేణులు అందరు వారి పరిధిలోని ఇంటి ఇంటికి వెళ్లి మన ప్రజాపాలన ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించాలని కోరారు. జిల్లాలో చాలా వరకు టీడీపీ,సీపీఐ శ్రేణులతో కలిసి ముందుకు సాగుతున్నామని అన్నారు. మన ప్రజాపాలన అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి సల్పుతున్నారని పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్,సన్న బియ్యం,మహిళలకు ఉచిత బస్ ప్రయాణం అదేవిధంగా మహిళలను మహాలక్ష్ములనుచేయాలని డ్వాక్రా గ్రూప్ ద్వారా వడ్డీ లేని రుణాలు,రైతులకు గత ప్రభుత్వం అటకెక్కించిన వ్యవసాయ పరికరాల రాయితీ మరల ప్రవేశ పెట్టారని,పేదలకు విద్యను అందించేందుకు ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, గురుకులాలలో నాణ్యమైన మెనూ, ఇతర సౌకర్యాల చార్జీలపెంపు, ప్రతి ఒక్కరికి వైద్యం అందుబాటులో ఉండే విధంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రులను మెరుగు పరుస్తున్నారని అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి పాటుబడుతున్న ప్రజా పాలన ప్రభుత్వానికి జిల్లా లోని ఐదు మున్సిపాలిటీలలో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని శ్రేణులు అందరు ఐక్యంగా పని చేయాలని కోరారు.

# అవగాహనతోనే క్యాన్సర్‌పై విజయం సాధ్యం



పులిచెర్ల, (జర్నలిస్ట్ ఫైల్) : క్యాన్సర్ నివారణకు ఆరోగ్యకరమైన జీవనశైలి అత్యంత కీలకమని వైద్యాధికారి యల్లయ్య తెలిపారు. చిత్తూరు జిల్లా పులిచర్ల మండలం ఎల్లంకివారిపల్లిలో బుధవారం క్యాన్సర్ మొహమ్మారి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమతుల్య ఆహారం, నిత్య వ్యాయామం, పొగతాగడం మానేయడం, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించవచ్చని వైద్యాధికారి యల్లయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో వైద్యాధికారిణి రమ్య శ్రీ, ఎం.పి.హెచ్.ఈ.ఓ జి. రామచంద్రయ్య , సూపర్వైజర్ శారదమ్మ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కొండపుర్ విద్యార్థి



నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం (జర్నలిస్ట్ ఫైల్) : సిరికొండ మండలం కొండపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకి చెందిన విద్యార్థి ఎం. శ్రీశాంత్ ఉమ్మడి జిల్లా నిజామబాద్ అండర్-16 వాలిబాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి క్రీడ పోటీల్లో ఎంపిక కావడం జరిగింది. ఫిబ్రవరి 05వ తేదీ నుండి 8వ తేదీ వరకు నిజామబాద్ జిల్లా కమ్మర్ పల్లిలో జరిగే రాష్ట్ర స్థాయిలో పాల్గొంటారు. ఇట్టి సందర్భంగ శ్రీశాంత్ ని ప్రధానోపాధ్యయులు లాల్ సింగ్, పిఆర్టియు మండల అధ్యక్షులు మోజీరామ్, పిఇడి శ్రీనివాస్ మరియు ఉపాధ్యయుల బృందం మరియు కొండపుర్ గ్రామ సర్పంచ్ శ్రీమతి మానసశ్రీధర్ విడిసి సభ్యులు అభినందించరు.

# టెట్, సిపియస్, యన్ఇపి రద్దు కోసం మార్చ్ టు పార్లమెంట్ పోరాట కార్యక్రమానికి బయలుదేరిన టియస్ యుటిఎఫ్ శ్రేణులు




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని, నూతన ఫెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత ఫెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానం 2020 ని రద్దుచేసి శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని, శాసనమండలి ఎన్నికలలో ఓటు హక్కు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కల్పించాలని, కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగ ఉపాధ్యాయులకు పనికి తగ్గ మినిమమ్ టైమ్ స్కేల్ అందించాలని, పాఠశాలల విలీనం - మూసివేతలను ఉపసంహరించుకోవాలని, రెగ్యులర్ నియామకాలు చేపట్టాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించరాదని , బోధనకే పరిమితం చేయాలని, ఇన్కమ్ టాక్స్ స్లాబ్ రేట్లను సవరించాలనే తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ,, జాతీయస్థాయిలో గురువారం ఢిల్లీ నందు జరిగే మార్చ్ టు పార్లమెంట్ పోరాట కార్యక్రమానికి ఖమ్మం






జిల్లా నుండి టియస్ యుటిఎఫ్ శ్రేణులు 67 మంది బయలుదేరారని టియస్ యుటిఎఫ్ జిల్లా కమిటీ తెలియజేసింది. మార్చ్ టు పార్లమెంట్ కార్యక్రమం ద్వారా నైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసింది. ఢిల్లీ వెళ్లే వారిలో నాయకులు చావా దుర్గాభవాని, పారుపల్లి నాగేశ్వరరావు, ఎల్లయ్య, లివిన్ స్టన్, బుర్రి వెంకన్న, బాణోత్ రాందాస్, ధర్మసోత్. నాగేశ్వరరావు ,పి సురేష్, కె.విజయ్ కుమార్, ఎ.కోటేశ్వరరావు, సుభాషిణి, జె.జ్యోతి, నాగలక్ష్మి, భాగ్య, లక్ష్మి, బి.జ్యోతి, పద్మజ, వసంత, రంగారావు, యన్.వి, ఐ.నాగేశ్వరరావు, నర్సింహారావు, సుధాకర్, లూర్థుమేరి తదితరులున్నారు.

# ప్రజాసేవే ధ్యేయంగా పనిచేసిన చేకూరి కాశయ్య




ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ప్రజాసేవనే జీవిత ధ్యేయంగా మలుచుకున్న చేకూరి కాశయ్య సేవలను కమ్మ మహాజన సంఘం నేతలు స్మరించుకున్నారు. ఖమ్మం స్వర్ణభారతి కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కమ్మ మహాజన సంఘం అధ్యక్షులు కొల్లు రఘు సత్యనారాయణ, కార్యదర్శి చావా రాము మాట్లాడుతూ 1936 ఫిబ్రవరి 4న జన్మించిన కాశయ్య మాజీ ఎమ్మెల్యేగా, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. ఆయన సేవలు తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కమ్మ మహాజన సంఘం నిర్మాతల్లో ఒకరిగా సంఘ బలోపేతానికి కీలక పాత్ర పోషించిన కాశయ్య సామాజిక న్యాయం, విద్యా అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పనిచేశారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు కర్నాటి రమాదేవి, సహాయ కార్యదర్శి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మలకుమారి, కార్యవర్గ సభ్యులు మోతుకూరి సత్యనారాయణ, నల్లమల ఆనంద్, కోలేటి నవీన్, మేదరమెట్ల స్వరూపరాణి, డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, బండి రవికుమార్, తాళ్లూరి మురళీకృష్ణతో పాటు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మంచి ఉన్నంత కాలమే మర్యాద, లేదంటే యుద్ధమే

## శక్తి ఇచ్చారు, అభివృద్ధి చేసి చూపిస్తా ఏదులాపురం మున్సిపాలిటీని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఏదులాపురం, (జర్నలిస్ట్ ఫైల్) : "రాష్ట్రంలో మన ప్రభుత్వం ఉంది. మీ శ్రీనన్న మంత్రిగా కీలక స్థానంలో ఉన్నాడు. మీ దీవెనలతో ఏదంటే అది చేయగలిగే శక్తి నాకు వచ్చింది. ఇక అభివృద్ధి చేసి



చూపిస్తా" అని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 10, 11, 28, 29, 30 వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గత పాలకుల తీరుపై నిప్పులు చెరిగారు.

### రావణ కాష్టాన్ని పారద్రోలారు

రాష్ట్ర ప్రజలు పదేళ్ల 'రావణాసుర' పాలనను అంతం చేసి, ప్రజా పరిపాలనను తెచ్చుకున్నారని మంత్రి వ్యాఖ్యానించారు. "మంచి ఉన్నంత కాలమే మర్యాద ఉంటుంది.. అది లేనప్పుడు యుద్ధం చేయాల్సిందే" అని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, పేదల ఇళ్ల కంటే దొరల ఇళ్లకే ప్రాధాన్యత ఇచ్చిందని ఆరోపించారు. కనీసం హాస్టల్ విద్యార్థులకు సరిగ్గా అన్నం పెట్టలేని వారు నేడు కబుర్లు చెబుతున్నారని, అలాంటి వారిని నమ్మవద్దని కోరారు.

### పార్టీ రంగులు చూడబోం పేదరికమే ప్రామాణికం

సొంతింటి కల నెరవేర్చే విషయంలో రాజకీయాలకు తావులేదని మంత్రి స్పష్టం చేశారు. "మీరు ఏ పార్టీకి ఓటు వేశారనేది నాకు అనవసరం. మీరు అర్హులైన పేదవాళ్లయితే చాలు.. పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతాం" అని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ. 22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టామని, వచ్చే ఏప్రిల్ నుంచి మరో విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ చేస్తామని వెల్లడించారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగులకు ఒకటో తారీఖునే జీతాలు వంటి వాటితో నేడు ప్రతి ఇల్లూ సంతోషంగా ఉందన్నారు.

### పెద్ద కొడుకుగా బాధ్యత నాది

ఏదులాపురం మున్సిపాలిటీని రాష్ట్రంలోనే ఒక మేటి (రోల్ మోడల్) మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యతను తాను తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. "మీ ఇంటి పెద్ద కొడుకుగా మీ సమస్యలన్నీ తీరుస్తాను. తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాను" అని భరోసా ఇచ్చారు. మాటలు చెప్పే వారిని కాకుండా, పని చేసే వారిని గుర్తించాలని ప్రజలను కోరారు.

### డిపాజిట్లు రాకుండా బుద్ధి చెప్పండి

ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో ప్రత్యర్థులకు డిపాజిట్లు రాకుండా బుద్ధి చెప్పాలని మంత్రి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థులు తుమ్మల బిక్షం (10వ వార్డు), పేరం వెంకటలక్ష్మి (11వ వార్డు), నూకల రామ్మోహన్ రెడ్డి (28వ వార్డు), వెంపటి ఉమ (29వ వార్డు), కొట్టం శిరీష (30వ వార్డు)లను హస్తం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.

# రాయలసీమకు ద్రోహం చేసింది జగన్ నే

## రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో జగన్ ప్రజా ధనం లూటి చేశారు

## రాయలసీమకు వైసీపీ చేసిన ద్రోహంపై ముందు సమాధానం చెప్పాలి

## దివంగత ఎన్ టీ ఆర్ వల్లే రాయలసీమకు తాగు, సాగునీరు

## మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి డిమాండ్



నంద్యాల, (జర్నలిస్ట్ ఫైల్) : రాయలసీమకు ఎక్కువ అన్యాయం చేసింది జగన్ పాలనలోనేనని, మీ ద్రోహం పై సమాధానం చెప్పి వైసీపీ సభ జరుపుకోండనీ, రాయలసీమకు



టీడీపీ, వైసీపీ ఏమి మేలు చేసిందో కొండారెడ్డి బురుజు వద్ద చర్చకు వైసీపీ నాయకులు సిద్దమా అంటూ మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి బహిరంగ సవాల్ విసిరారు. బుధవారం కర్నూలు కంట్రోల్ రూమ్ వద్ద తన కాంప్లేక్స్ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు కృషి వల్లే తెలుగు గంగా, జి ఎన్ ఎస్ ఎస్, హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఏర్పడి తాగు, సాగు నీరు అందిందని,, రాయలసీమ ద్రోహనిక పాల్పడి మళ్ళీ బహిరంగ సభనా వైసీపీ కీ ఛిగ్గుండాలనీ. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టు లకు ఒక గంప మట్టి వేశావా జగన్, జీ ఓ 365 పేరుతో రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టు లకు మరణశాసనం రాసింది నువ్వు కాదా జగన్ అంటూ బైరెడ్డి మండి పడ్డారు. కరువు, అప్పులు, నిరుద్యోగం రాయలసీమను వెంటాడుతున్నాయని, ప్రాజెక్టు కట్టి పొలాలకు నీరు ఇచ్చి చీకటి తరిమి కొట్టాలనీ గల్లీ నుంచి ఢిల్లీ వరకు తన నాయకత్వంలో అనే పోరాటాలు, ఉద్యమాలు చేసి కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికీ రాయలసీమ కష్టాలు చెప్పామని బైరెడ్డి రాజశేఖరరెడ్డి వివరించారు. మా వెతలు పోతుందన్న ఆశా తో ఉన్న రాయలసీమ ప్రజలకు రాయలసీమ ఎత్తిపోతల పథకం పేరుతో రాయలసీమకు కాకుండా నెల్లూరు జిల్లా రిజర్వాయర్లకు నీరు తరలించాలనుకోవడం ద్రోహం కాదా జగన్ అని బైరెడ్డి నిలదీశారు. రాయలసీమకు కేసీఆర్, జగన్ లు తోడు దొంగలు అని బైరెడ్డి అన్నారు. ఒకే కంచం, ఒకే మంచం లో ఉన్న జగన్, కేసీఆర్ పాలనలోనే ప్రజా ధనం దోచుకునేందుకు రాయలసీమ ఎత్తిపోతల పథకం తెచ్చారని, ఇది సాధ్యం కాదని ఆ నాడే జగన్ ప్రభుత్వం కు తాను సూచనలు చేశానన్నారు. జగన్ పాలనలో సక్రమంగా అనుమతులు లేవని రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిచిపోతే తన తప్పిదం కప్పిపుచ్చుకునేందుకు సీఎం చంద్రబాబు ఆపారు అనడం సరి కాదన్నారు. బానకచర్ల కాంప్లెక్స్ వద్ద ఎస్ ఆర్ బి సి, తెలుగుగంగ ప్రధాన కాలువల నీటి ప్రవాహానికి అడ్డం వేసి ఎస్కేప్ ఛానల్ ద్వారా కుందూనదిలో పోసి ఐదేళ్ళు రాయలసీమకు కాకుండా నెల్లూరు కు తరలించింది నిజం కాదా జగన్ అన్నారు. కృష్ణా యాజమాన్యబోర్డు విశాఖపట్నం లో పెట్టాలని జగన్ నిర్ణయం చాలా బాధేసిందని బైరెడ్డి అన్నారు. నీటి నిలువ రిజర్వాయర్లు రాయలసీమ లో నిర్మాణం చేయకుండా రోజుకు 3 టీ ఎం సి ల నీరు తోడి ఏమి చేస్తావ్ జగన్, రూ. 6 వేల కోట్లు ధోసుకోవడం కోసమే కదా అన్నారు. కేవలం రూ. 900 కోట్ల తో సిద్దేశ్వరం వద్ద కృష్ణానది పై తీగల వంతెన బదులు బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మాణం చేస్తే సంగమేశ్వరం వద్ద 60 టీ ఎం సి ల నీరు నిలిచి రాయలసీమ ప్రాజెక్టు లకు అంది కరువు, వలసలు, నిరుద్యోగ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనీ, ఆ వైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలని బైరెడ్డి రాజశేఖరరెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేముల శ్రీధర్, మల్లెల పుల్లారెడ్డి, నారాయణ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, సీమ కృష్ణ, రవి కుమార్, రఘునాథ్ రెడ్డి, వీరాపురం కె వి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి, ఇంటర్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

## ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతి పెద్ద బహుమతి

## నాణ్యమైన విద్యతో ప్రభుత్వ గురుకులాలకు పెరుగుతున్న ప్రజాదరణ

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన సోషల్ జస్టిస్ డే వేడుకలలో పాల్గొన్న జిల్లా కలెక్టర్



ఖమ్మం, ఎర్రుపాలెం, (జర్నలిస్ట్ ఫైల్) : పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు ఇచ్చే అతిపెద్ద బహుమతి అని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. బుధవారం ఎర్రుపాలెం మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ఎర్రుపాలెం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో నిర్వహించిన తెలంగాణ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా డాక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, విద్యార్థినిలతో కలిసి కలెక్టర్ సామాజిక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ కుల వివక్ష లేని సమాజంగా తెలంగాణలో నిర్మించే దిశగా ప్రభుత్వం సామాజిక ఆర్థిక సర్వేను విజయవంతంగా నిర్వహించి, రిపోర్టును ఫిబ్రవరి 4, 2025న అసెంబ్లీలో ప్రవేశ పెట్టిందని అన్నారు. కుల, మత విభేదాలు లేకుండా ప్రతి ఒక్కరికి సమాన అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. గురుకులాల్లో చదివే పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించేందుకు డైట్ చార్జీలను 40 శాతం పెంచడం జరిగిందని, పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అందించడం కోసం సమీకృత గురుకులాల నిర్మాణం చేపట్టిందని అన్నారు. సామాజిక న్యాయం ఉన్న సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో పని చేస్తుందని అన్నారు. ప్రభుత్వం కల్పించే సదుపాయాలను వినియోగించుకుంటూ పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకుంటే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని కలెక్టర్ అన్నారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం లక్షలు, కోట్ల రూపాయలు ఖర్చు చేసి మంచి విద్యాసంస్థలు ఏర్పాటు చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన డైట్, కాస్మొటిక్ ఛార్జీలు, ఇతర మౌళిక వసతులు మెరుగుపరిచేందుకు చర్యలు చేపట్టిందని అన్నారు. ప్రభుత్వ గురుకులాలకు ప్రజల నుంచి మంచి డిమాండ్ ఉందని అన్నారు. మంచి విద్యాసంస్థల్లో నేడు పిల్లలు చదువుతున్నా రని, అనేక ప్రైవేట్ పాఠశాలల కంటే మెరుగైన ల్యాబ్, క్రీడలు ఆడేందుకు



వసతులు మన గురుకులాల వద్ద ఉన్నాయని తెలిపారు. పిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవడమే తల్లిదండ్రులకు మనం ఇచ్చే అతి పెద్ద బహుమతి అవుతుందని, భవిష్యత్తులో ఎట్టి పరిస్థితుల్లో రిగ్రెట్ ఫీల్ కాకుండా ఉండాలని అన్నారు. చదువు, క్రీడలు, మనం చేసే పనిలో పిల్లలు తమ ఎనర్జీనీ 100 శాతం అందించాలని అన్నారు. విజయం వెంటనే రాదని, అనేక ఓటములు, అడ్డంకులను అధిగమిస్తేనే మంచి విజయం సాధ్యం అవుతుందని అన్నారు. రాబోయే 10, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర మార్కెట్ కమిటీ చైర్మెన్ బండారు నరసింహారావు, ఎర్రుపాలెం మండల తహసీల్దారు ఉషా శారద , ఎంపిడివో బి. సురేందర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డ్వాక్రా సంఘాలలో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలి : పల్నాడు కలెక్టర్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)** :పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా డ్వాక్రా స్వయం సహాయక సంఘాల రుణాలలో జరుగుతున్న అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. నరసరావుపేటలోని జిల్లా కలెక్టరేట్‌లో మెప్మా డిఆర్డీఏ అధికారులతో ఆమె అత్యవసర సమావేశం నిర్వహించారు.
సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు జరిగిన విచారణలో తేలిన విషయాల ఆధారంగా తప్పుడు ధ్రువపత్రాలు, నకిలీ ఫోటోలు, జోడించి కృత్రిమ సంఘాలు ఏర్పాటు చేసి రుణాలు పొందిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. అవసరమైతే వారి ఆస్తులను జప్తు చేసే చర్యలు చేపట్టాలని, ఆస్తుల అమ్మకాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ మురళీకృష్ణ, డీఆర్డీఏ పీడీ ఝాన్సీరాణి, జిల్లా సహకార ఆడిటర్ నాగశ్రీనివాసరావు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్పన, డీఎస్పీ రమణ తదితరులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లాలో డ్వాక్రా, మెప్మా సంఘాల నిధుల దుర్వినియోగం, మహిళల సొమ్ము దారి మళ్లించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని కలెక్టర్ కృతిక శుక్లా ఇటీవలే ప్రకటించారు. ఇలాంటి అక్రమాలు జరిగితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో జరిగిన ఈ సమావేశం మరింత కీలకమైనదిగా మారింది. ఈ చర్యల ద్వారా డ్వాక్రా మహిళలకు అందుతున్న రుణ సౌకర్యాలు సరైన వారికే చేరేలా, పారదర్శకత పెరిగేలా చూడాలనేది కలెక్టర్ లక్ష్యంగా కనిపిస్తోంది.

## క్వాంటం వ్యాలీ శంకుస్థాపన ఏర్పాట్లు పరిశీలన



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**: ఈనెల ఏడవ తేదీన క్వాంటం వ్యాలీకి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్న దృష్ట్యా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా గురువారం ఉద్దండరాయ పాలెం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా క్వాంటం వ్యాలీ నెలకొల్పుతున్న విషయం విదితమే. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఆహ్వానితులు అందరూ మధ్యాహ్నం 1.30 గంటల నాటికి ఆసీనులు కావాలని కోరారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, తదితర అంశాలను సంబంధిత అధికారులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, రెవిన్యూ డివిజనల్ అధికారి కె.శ్రీనివాస రావు, జిల్లా పౌర సరఫరాల అధికారి పి.కోమలి పద్మ, అదనపు ఎస్పీ రమణ మూర్తి, డి ఎస్పీ మురళి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన వక్ఫ్ బోర్డ్ చైర్మన్



**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**: ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్, జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ను గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వక్ఫ్ బోర్డు అంశాలను జిల్లా కలెక్టర్ కు వివరించారు.

# డ్రగ్స్ నియంత్రణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే నసీర్

- మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం
- విద్యార్థులు చైతన్యం కావాలి
- కలిగి ఉన్నా, వినియోగించినా నేరమే..
- డ్రగ్స్ పై అవగాహన ర్యాలీలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**: సమాజంలో డ్రగ్స్ నియంత్రణకు ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థులు గురువారం నగరంలో నిర్వహించి డ్రగ్స్ వద్దు బ్రో ర్యాలీలో పాల్గొని ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఈగల్ టీమ్ ద్వారా డ్రగ్స్ నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, యువతలో మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రతి కాలేజీలో డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై తెలియజేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా, ఎవరైనా డ్రగ్స్ కలియున్నా , వినియోగించినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కళాశాలల్లో డ్రగ్స్ కదలికలు ఉంటే సహించబోమని హెచ్చరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో గత వైసీపీ ప్రభుత్వంలో డ్రగ్స్ మహమ్మారి ఎక్కువగా ఉండేదని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రణాళికాయుతంగా డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపట్టామని వెల్లడించారు.

# ల్యాప్ టాప్‌ల దొంగ అరెస్ట్ ...15 ల్యాప్ టాప్‌లు స్వాధీనం

- విలేకరుల సమావేశంలో మంగళగిరి డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ
- ప్రముఖ యూనివర్సిటీలే లక్ష్యం
- కె తమిళ్ సెల్వన్‌పై 11 రాష్ట్రాలలో కేసులు
- 61 ల్యాప్ టాప్ లు చోరీ ..
- చిక్కుముడిని ఛేదించిన మంగళగిరి రూరల్ పోలీసులు



**మంగళగిరి (జర్నలిస్ట్ ఫైల్)**: ప్రముఖ విశ్వవిద్యాలయ హాస్టల్ లలో అపరిచితునిగా సంచరిస్తూ విద్యార్థుల ల్యాప్ టాప్ లను చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగను మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళగిరి నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో డిఎస్పి సిహెచ్ మురళీకృష్ణ వివరాలను వెల్లడించారు. మంగళగిరి మండలం కు రగల్లు గ్రామ పరిధిలోని అమృత యూనివర్సిటీ హాస్టల్లో గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన బాయ్స్ హాస్టల్ లో మూడు ల్యాప్ టాప్ లను దొంగిలించాడు. అదే రోజున నీరుకొండ ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హాస్టల్లో రెండు ల్యాప్ టాప్ లను చోరీ చేశాడు. ఆయా ఫిర్యాదులపై కేసు నమోదు చేసిన మంగళగిరి రూరల్ పోలీసులు సిసి ఫుటేజ్ ఆధారంగా సమగ్ర విచారణ చేపట్టినట్లు డిఎస్పి తెలిపారు.
తమిళనాడు రాష్ట్ర తిరువారూర్ జిల్లా పులివలం గ్రామానికి చెందిన కె. తమిళ్ సెల్వన్ ను అనుమానితునిగా అదుపులోకి తీసుకొని విచారించగా 11 రాష్ట్రాలలో 61 ల్యాప్ టాప్ చోరీ కేసుల చిక్కుముడి వీడిందన్నారు. 12 లక్షలు విలువ చేసే 15 ల్యాప్ టాప్ లను నిందితుని వద్ద నుండి రికవరీ చేసినట్లు డిఎస్పి తెలిపారు. ఉబర్ యాప్ ద్వారా కారులో యూనివర్సిటీలకు అడ్మిషన్ పేరుతో లోపలకి వెళ్లి ఆఫీస్ కి వెళ్లకుండా, హాస్టళ్లకు వెళ్లి చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు . సెల్వాన్ చోరీ చేసిన ల్యాప్ టాప్ లను ఢిల్లీ చెన్నై నగరాల్లో విక్రయించినట్లుగా తెలిపారు. విలేకరుల సమావేశంలో మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం ఎస్ఐలు సిహెచ్ వెంకట్, ఆర్ రవితేజ, ఏఎస్ఐ రత్నరాజు, హెడ్ కానిస్టేబుళ్లు డి శ్యామ్, బి. రామలింగేశ్వరరావు, సాగర్ సాగర్ పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు రూ. 8.60 కోట్లు నిధులు మంజూరు : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

- గ్రామాల్లో రోడ్ల కనెక్టివిటీ, సిసి రోడ్లు, డ్రైన్లు, లో లెవెల్ బ్రిడ్జిల నిర్మాణం, అభివృద్ధి పనులకు రూ.8.60 కోట్లు
- వయ్యకల్లు సభలో జీవీ ఆంజనేయులు వెల్లడి
- రూ. 50లక్షలతో లో లెవల్ బ్రిడ్జికి శంకుస్థాపనచేసిన జీవీ



**వినుకొండ (జర్నలిస్ట్ ఫైల్ )** : వినుకొండ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో రూ. 8.60 కోట్లనిధులు మంజూరైనట్లు ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వెల్లడించారు. శావల్యాపురం మండలం, వయ్యకల్లు గ్రామంలో రూ. 50 లక్షల రూపాయల అంచనా వ్యయంతో లో-లెవబ్రిడ్జికి చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల కనెక్టివిటీని పెంచుతున్నామని,సీసీరోడ్లు, డ్రైన్లు, లో లెవల్ బ్రిడ్జిల నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వయ్యకల్లులో రూ.50 లక్షలతో లో లెవల్ బ్రిడ్జితోపాటు, రూ.18 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు వెల్లడించారు. శానంపూడి గ్రామంలో రూ. 40 లక్షలతో బ్రిడ్జి నిర్మాణంకు శంకుస్థాపన చేశామన్నారు. అదేవిధంగా వితంరాజుపల్లి పిచికలపాలెం రోడ్డు నిర్మాణానికి రూ. 3.40కోట్లు, గంటావారి పాలెం-వెలమావారిపాలెం రోడ్డుకు రూ. 84 లక్షలు, ఈపూరు - ఊడిజర్ల రోడ్డుకు రూ. 1.కోట్లుతో సహా మొత్తంగా 5 రోడ్లకి రూ. 8.60 కోట్ల రూపాయలు నిధులు ప్రభుత్వం విడుదల చేయటం శుభపరిణామనన్నారు. గ్రామాల్లో దశాబ్దాలుగా ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుం దన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కంకణం కట్టుకున్నామని ప్రజల జీవితాల్లో ఎన్నో మార్పులు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యే గళ్ళా మాధవిని కలిసిన మిర్చియార్డు నూతన డైరెక్టర్లు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్)**: గుంటూరు మిర్చి యార్డు డైరెక్టర్లుగా నియమితులైన మేళం సైదయ్య, షేక్ ఖాదర్ బీ, దర్శనపు విజయమ్మ, చంద్రగిరి బాబు, బత్తుల జాన్ సైదా, కటకం శెట్టి విజయలక్ష్మి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. తమపై విశ్వాసం ఉంచి డైరెక్టర్లుగా నియమింపజేయడంలో సహకరించినందుకు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తామని, మిర్చి యార్డును మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తామని డైరెక్టర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి నూతన పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, యార్డు కార్యకలాపాలు పారదర్శకంగా సాగాలని, రైతుల సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరించాలని సూచించారు. మిర్చి వ్యాపారాన్ని మరింత బలోపేతం చేసేలా యార్డు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు.

## 11నుండి కుంచవరం శ్రీవారాహీమాత సన్నిధానంలో కోటికుంకుమార్చనలు



- శ్రీ ప్రజ్ఞానంద సరస్వతిస్వామి

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్)**: ఆర్తిమీర కొలిచే భక్తుల అభీష్టాలు నెరవేర్చే శ్రీ వారాహీ అమ్మవారి సన్నిధానంలో, శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ సహిత, కోటి కుంకుమార్చన పూజలకు ఎంతో ప్రాధాన్యత ఉందని, దంపతులు, సువాసినీలు, కన్యలు కుంకుమార్చన సేవలలో తరించే అవకాశం వినియోగించుకోవాలని, పెనుగొండ శ్రీ వాసవి పీఠం పీఠాధిపతులు శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. స్థానిక గంగానమ్మపేట లోని శ్రీవిద్య పీఠం,శ్రీ సాలిగ్రామ మఠం ప్రాంగణంలో గురువారం కోటి కుంకుమార్చన పూజా కార్యక్రమాల ప్రచార కరపత్రాలను శ్రీ ప్రజ్ఞానంద సరస్వతి స్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మీడియాతొ మాట్లాడుతూ కొల్లిపర మండలం కుంచవరం గ్రామంలో వేంచేసియున్న, శ్రీ వారాహీమాత ఆలయ ప్రాంగణంలో ఈనెల 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణ సహిత, కోటి కుంకుమార్చన పూజా కార్యక్రమాలను, ఈ ప్రాంతంలో దశాబ్ద కాలం తర్వాత ప్రారంభించుకోవడం జరుగుతుందన్నారు. ఉచితంగా నిర్వహించే కోటి కుంకుమార్చన పూజల ద్వారా, భక్తులు తమ అభీష్టాలు నెరవేర్చుకునే అవకాశమని అన్నారు. ప్రచార కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమంలో యోగాచార్య, ఎమ్. రమణయ్య, గోపు ప్రభారాణి, పెనుగొండ ప్రమీల, శ్రీ వారాహి మాత ఆలయ వ్యవస్థాపక దంపతులు తన్నీరు శ్రీనివాసబాబు, మల్లీశ్వరి, పి. వెంకట ఆదిలక్ష్మి, వక్కలగడ్డ రామ్మోహనరావు, కోట లక్ష్మి కుమారి, సువర్ణ, శ్రీనివాస్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ వ్యాధి పై విద్యార్థులకు అవగాహన



**బ్రహ్మంగారి మఠం( జర్నలిస్ట్ ఫైల్)** : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా బ్రహ్మంగారిమఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి డాక్టర్ సంపత్ కుమార్ స్థానిక శ్రీ గోవిందమాంబ బాధితుల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ఏ విధంగా వస్తుంది ఈ వ్యాధి రాకుండా ఏ విధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి క్యాన్సర్ వ్యాధిని ఎలా గుర్తించాలి వ్యాధి లక్షణాలు ఎలా ఉంటాయో విద్యార్థులకు తెలియజెప్పి అలాగే 18 సంవత్సరములు దాటిన ప్రతి ఆడ మగ వ్యక్తులకు ఉచితంగా మీ ఇంటి వద్దకు వచ్చి క్యాన్సర్ పరీక్షలు చేయడం జరుగుతుందని ఈ ముందస్తు పరీక్షలు చేయించుకొని క్యాన్సర్ బాధ పడకుండా తగు జాగ్రత్తలు తీసుకొని క్యాన్సర్ ను తగ్గించుకోవచ్చని బి.మఠం ప్రాథమిక వైద్యశాల నందు క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని మండలంలోని ప్రతి ఒక్కరూ తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు మొదటి దశలోనే క్యాన్సర్ను గుర్తించినట్లయితే దాని నివారణకు మందులు వాడి ఉపశమనం పొందచ్చునని ప్రతి ఒక్కరూ అశ్రద్ధ వహించకుండా ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాలను కాపాడుకోవాలని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ పుష్పరాజ్, ల్యాబ్ టెక్నీషియన్ రమణ, ఎంపీహెచ్ఏ వీర జోత్స్న, విజయలక్ష్మి,ఏఎన్ఎం లు,ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బ్రహ్మం సాగర్ కాలువలో గుర్తు తెలియని శవం లభ్యం

**బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్)**: బ్రహ్మంగారిమఠం మండలం జోకుపల్లె గ్రామం వద్ద ఉన్న తెలుగు గంగ బ్రహ్మం సాగర్ కాలువలో గుర్తుతెలియని శవం తేలియాడుతున్నట్లు స్థానికులు గుర్తించి స్థానిక ఎస్సై శివప్రసాద్ కు విషయం తెలియజేయగా వారు తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు కాలువలో తేలియాడుతున్న శవాన్ని స్థానికుల సహాయంతో ఒడ్డుకు చేర్చారు అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ సుమారు మృతుని వయసు 30 సంవత్సరాలు కలిగిన మగ వ్యక్తి శవాన్ని గుర్తించడం జరిగిందని తన వివరాలు మీడియా ద్వారా అందరికీ చేరవేసామని ఎవరైనా తెలిస్తే పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని ఆయన తెలిపారు

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

# కళా నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహించాలి




**ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ ఫైల్)**: ప్రతి విద్యార్థిలోనూ పుట్టుకతోనే ఏదో ఒక కళా నైపుణ్యం ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాలని ప్లేబ్యాక్ సింగర్, కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ కొమండూరి రామాచారి కోరారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న "విజ్ఞాన్ మహోత్సవం" గురువారం వైభవంగా ప్రారంభమైంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్లేబ్యాక్ సింగర్, కంపోజర్, లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు డాక్టర్ కొమండూరి రామాచారి మాట్లాడుతూ విద్యార్థి పరిపూర్ణతకు మూడు సూత్రాలు ముఖ్యమన్నారు. సైన్స్, ఫైన్ ఆర్ట్స్ మరియు స్పోర్ట్స్... ఈ మూడింటి కలయికే ఒక వ్యక్తిని సమాజంలో తిరుగులేని నాయకుడిగా నిలబెడుతుందని పేర్కొన్నారు. 'కేవలం పుస్తక పఠనం, సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే విద్యార్థిని ఉన్నతుడిగా తీర్చిదిద్దలేవని, సైన్స్ -- టెక్నాలజీతో పాటు లలిత కళలు మరియు క్రీడలలో ప్రావీణ్యం ఉన్నప్పుడే ఒక విద్యార్థి పరిపూర్ణ వ్యక్తిగా ఎదుగుతాడు' అని ఉద్ఘాటించారు. ఈ మూడు రోజుల మహోత్సవాన్ని కేవలం గెలుపోటముల పోటీగా చూడవద్దని, ఇది విజ్ఞానాన్ని పంచుకోవడానికి నేర్చుకోవడానికి ఒక అద్భుతమైన వేదిక అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. విజ్ఞాన్స్ సంస్థ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను ఆయన ప్రశంసించారు. దేశంలోని అన్ని విద్యాసంస్థలు ఇదే బాటలో పయనిస్తే, భారతదేశం 'విశ్వగురువు'గా ఎదగడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. 'ఓటమికి తలవంచకండి.. పోరాడి గెలవడమే అసలైన విజయం. పట్టుదలతో ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదు' అని విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు.

**ఓటమి ఒక పాఠశాల : విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

క్రీడాకారులకు గెలుపు ఒక వాక్యం, ఓటమి అనేది ఒక పాఠశాల లాంటిదని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. ఆటలో గెలిచిన వారికి శుభాకాంక్షలు చెప్పడం సహజం. కానీ ఓడిన వారినీ అభినందించడం చాలా ముఖ్యమన్నారు. ఎందుకంటే వారు ధైర్యంగా బరిలో నిలబడ్డారు, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. క్రీడలో గెలిచినా, ఓడినా – ఇద్దరికీ చప్పట్లు కొట్టాలి. అదే నిజమైన స్పోర్ట్స్ స్పిరిట్ అని తెలియజేసారు. ప్రతి ఓటమి ఒక పాఠం. ఆ పాఠం ద్వారా వచ్చే సారి మెరుగ్గా ఆడగలమనే విశ్వాసం పెరుగుతుందన్నారు. అనుభవం ఆటగాడిని మరింత బలపరుస్తుందని, ఒక మ్యాచ్ ఓడిపోవడం అంటే కెరీర్ ముగిసిపోవడం కాదన్నారు. అది కొత్త వ్యూహాలకు, కొత్త ఆలోచనలకు, కొత్త విజయాలకు మొదలు మాత్రమేనని అభిప్రాయపడ్డారు. ఆటలో మాత్రమే కాకుండా, జీవితంలోనూ ఒక బలమైన పునాది ఉండాలన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసి, వారిని భావి భారత నాయకులుగా తీర్చిదిద్దడమే విజ్ఞాన్స్ మహోత్సవ్ ప్రధాన ఉద్దేశ్యం' అని పేర్కొన్నారు. సరిగ్గా 19 ఏళ్ల క్రితం విజ్ఞాన్స్ సంస్థ ఈ 'మహోత్సవ్'ను ప్రారంభించిందని ఆయన గుర్తు చేశారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు చదువుతో పాటు 'లైఫ్ స్కిల్స్' (జీవన నైపుణ్యాలు) నేర్పించాలనే ఉద్దేశ్యంతో యూత్ ఫెస్టివల్‌ను పరిచయం చేసిన మొదటి సంస్థ విజ్ఞాన్స్ అని ఆయన గర్వంగా ప్రకటించారు. ఈ వేదిక కేవలం ఆటపాటలకే పరిమితం కాదని.. కమ్యూనికేషన్ స్కిల్స్, ఫోటోగ్రఫీ, కళలు, క్రీడలు వంటి అనేక అంశాల్లో విద్యార్థులు ప్రావీణ్యం సంపాదించేందుకు ఇది ఒక అద్భుతమైన అవకాశమని తెలిపారు. సుమారు 150 నుండి 200 కళాశాలల విద్యార్థులు ఇక్కడ కలుసుకోవడం వల్ల కొత్త స్నేహాలు, సరికొత్త అనుభవాలు లభిస్తాయని చెప్పారు. ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడి ఇక్కడి విజ్ఞాన్స్ మహోత్సవాల్లో ఒక విద్యార్థిగా తన ప్రస్థానాన్ని మొదలుపెట్టారని, ఆ అనుభవమే ఈ రోజు ఆయనను గొప్ప దర్శకుడిగా నిలబెట్టిందని గుర్తు చేశారు. విద్యార్థులంతా ఆ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. తనతో పాటు మరో వంద మంది నాయకులను తయారు చేసినప్పుడే నిజమైన నాయకత్వం సిద్ధిస్తుందని, అతిథిగా విచ్చేసిన రామాచారి వేలాది మందిని తీర్చిదిద్దడం ఇందుకు ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. 'జీవితంలో గెలుపోటములను సమానంగా స్వీకరించండి. ఓటమిని చూసి కుంగిపోవద్దు.. ఎందుకంటే ఓటమి అనేది విజయానికి పునాది రాయి వంటిది' అని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.
మహోత్సవ్ లాంటి కార్యక్రమాంలో గెలుపు మాత్రమే ముఖ్యమైంది కాదు, పాల్గొనడమే అసలైన విజయమని విజ్ఞాన్స్ వర్సిటీ సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి అన్నారు. విద్యార్థుల్లో పోటీ స్ఫూర్తి పాటు స్నేహ భావం కూడా పెంపొందాలనేది మా ఉద్దేశమని తెలిపారు. ఈ వేడుకల్లో 80 కి పైగా పోటీలు, వినోద కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి విద్యార్థి ఈ అనుభవాలను మధుర జ్ఞాపకాలుగా తీసుకెళ్లాలని, ఇతర కళాశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో మాట్లాడి, పరస్పరం పరిచయాలు పెంచుకుని, వారిని స్నేహితులుగా మార్చుకోవాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహిస్తామన్నారు.
జీవితంలో ఏవైనా కొత్తవి నేర్చుకోవడానికి ఆలస్యం చేయరాదని విజ్ఞాన్స్ వర్సిటీ ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర కేవీ క్రిష్ణకిషోర్ విద్యార్థులకు సూచించారు. జీవితంలో ప్రతి విద్యార్థి కూడా ఏదో ఒకటి సాధించేలా ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులు జీవితంలోని ప్రతి దశను, ప్రతి నిమిషాన్ని ఆస్వాదించి విజయతీరాలకు చేరాలన్నారు. విద్యార్థులు చదువుకే పరిమితం అవ్వకుండా యోగ, సంగీతం, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ముందు వరుసలో ఉండాలన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ఫిజికల్ ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోజులో కనీసం ఒక గంటైనా గ్రౌండ్‌లో ఆటలు ఆడాలన్నారు. వాకింగ్, స్విమ్మింగ్, డాన్సింగ్ లేదా జిమ్‌లోనైనా పాల్గొనాలన్నారు. యువతలో అంతర్లీనంగా సృజనాత్మక శక్తులు ఉంటాయని, ఈ సృజనాత్మకతను వెలికి తీయడానికే ఈ మహోత్సవాలన్నారు. చదువు అంటే పుస్తకాలు ఒక్కటే కాదని, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా పాఠ్యాంశాలేనన్నారు. యువత తమ సహజ శక్తులను దేశ ప్రయోజనాలకు ఉపయోగించాలన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్ ఫాస్ట్‌ను నిర్వహించారు.

**నేడు సందడి చేయనున్న సినీతారలు**

రెండో రోజు మహోత్సవ్‌లో భాగంగా నేడు జరిగే కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరెక్టర్ ప్రదీప్ అద్వైతం విచ్చేయనున్నారు.

**80 ఈవెంట్ల నిర్వహణ**

విజ్ఞాన్స్ యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహోత్సవ్‌లో మొత్తం 80 ఈవెంట్లను నిర్వహించారు. తొలుత నిర్వహించిన స్పోర్ట్స్ ఫీట్ విభాగంలో పారా స్పోర్ట్స్, ట్రాక్ అండ్ ఫీల్డ్, యోగా, పారా క్రికెట్, టెన్నికాయిట్, తైక్వాండో, ఫుట్‌బాల్, ఖో--ఖో, హాకీ, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, చెస్, అథ్లెటిక్స్, త్రోబాల్ తదితర క్రీడాంశాల్లో జాతీయ స్థాయిలో పోటీలు ప్రారంభించారు. అదేవిధంగా మ్యూజిక్, డాన్స్, డ్రామాటిక్స్, డిజిటల్ స్టోరీ టెల్లింగ్ అండ్ క్రియేటివ్ మీడియా, లిటరేచర్, విజువల్ ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్, ఫ్యాషన్ డిజైన్ అండ్ స్టైలింగ్, స్పాట్‌లైట్, గేమింగ్, రోబో గేమ్స్, లిటరరీ ఈవెంట్స్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్ వంటి సాంకేతిక, సాంస్కృతిక విభాగాల్లో కూడా జాతీయ స్థాయిలో పోటీలు ప్రారంభించారు.

**అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు:** మహోత్సవ్-2కే26 సంబరాల్లో భాగంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా అలరించాయి. కళాకారులు పలు నృత్య రూపకాలకు అనుగుణంగా నర్తించి మంత్రముగ్ధుల్ని చేశారు. ముఖ్యంగా జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఓలలాడించాయి. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ధ్యానం, యోగాతోనే సాధ్యమని చూపించిన నృత్య ప్రదర్శన విద్యార్థులను ఆకట్టుకుంది. అనంతరం కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన " క్రాకర్స్ షో" ఎంతగానో ఆకట్టుకుంది. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, ఇంచార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేవీ క్రిష్ణకిషోర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పీఎంవీ రావు, అడ్వైజర్, మాజీ డీజీపీ మాలకొండయ్య, విజ్ఞాన్స్ లారా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే.ఫణీంద్రకుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ.శ్రీనివాసబాబు, మహోత్సవ్ 2కే26 కన్వీనర్లు, కో- కన్వీనర్లు, కోఆర్డినేటర్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

